అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
మనసర్కార్
email: jobs@manasarkar.com

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
మనసర్కార్
email: jobs@manasarkar.com

సంపుటి: 01 ::: సంచిక:171 | హైదరాబాద్ 22 జనవరి 2026, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-171 | Hyderabad 22 January 2026, Thursday | Pages: 8, Rs. 5/-

## దక్షిణాదిపై బీజేపీ నజర్



బెంగళూరు (ఏడీఎన్ఎన్) :

దక్షిణాది రాష్ట్రాల్లో పట్టు సాధించే దిశగా బీజేపీ అడుగులు వేస్తోంది. గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ పోల్ ఇన్‌ఛార్జ్ గా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను అధిష్ఠానం నియమించింది. రాజస్థాన్ మాజీ అధ్యక్షుడు సతీష్ పూనియా, మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయలు ఆయనకు సహ ఇన్‌ఛార్జ్ లుగా వ్యవహరించనున్నారు. మే 25వ తేదీ తర్వాత జరగనున్న ఈ ఎన్నికల్లో ఈవీఎంలకు స్వస్తి పలికి, బ్యాలెట్ పేపర్ల ద్వారా ఓటింగ్ నిర్వహించాలని కర్ణాటక ఎన్నికల సంఘం నిర్ణయించడం విశేషం. దీనికి సంబంధించి రాజకీయ పార్టీలతో ఇప్పటికే సమావేశాలు ముగిశాయి. తెలంగాణలోనూ మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను మహారాష్ట్ర క్యాబినెట్ మంత్రి ఆశిష్ షెలార్‌కు అప్పగించారు. రాజస్థాన్ బీజేపీ నేత అశోక్ పర్నామి, ఎంపీ రేఖ శర్మ ఆయనకు తోడుగా నిలవనున్నారు...

...::: తరువాయి 2వ పేజీలో..



## మేయర్ పీఠం వారికే !

ముంబై (ఏడీఎన్ఎన్) :

దేశంలోనే అత్యంత ధనిక మున్సిపల్ కార్పొరేషన్ అయిన బీఎంసీ తదుపరి మేయర్ ఎవరనేది ఇప్పుడు ఒక 'చిట్టీ' మీద ఆధారపడి ఉంది. ఈ నెల 15న జరిగిన ఎన్నికల్లో బీజేపీ 89 స్థానాలతో అతి పెద్ద పార్టీగా నిలవగా, దాని మిత్రపక్షం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 29 సీట్లు గెలుచుకుంది. వీరిద్దరి కలిపి 'మహాయుతి' కూటమికి 118 సీట్లతో స్పష్టమైన ఆధిక్యం ఉన్నప్పటికీ, మేయర్ పదవి రిజర్వేషన్ లెక్కలు వారిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వుల ప్రకారం, గురువారం రాష్ట్ర సచివాలయంలో లాటరీ నిర్వహించి మేయర్ పదవి ఏ కేటగిరీకి కేటాయిస్తున్నారో ప్రకటిస్తారు. ఈ రిజర్వేషన్ రొటేషన్ పద్ధతిలో జనరల్, ఓబీసీ, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ ) లేదా మహిళల మధ్య మారుతూ ఉంటుంది. ఒకవేళ లాటరీలో మేయర్ పదవి ఎస్సీ లేదా ఎస్టీ కేటగిరీకి రిజర్వ్ అయితే, పోటీ లెక్కలన్నీ ఒక్కసారిగా మారిపోయే అవకాశం ఉంది. .

...::: తరువాయి 2వ పేజీలో..



## డిప్యూటీ సీఎం మాట్లాడింది తప్పే

చెన్నై (ఏడీఎన్ఎన్) :

తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గతంలో సనాతన ధర్మంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో మద్రాస్ హైకోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా, కరోనా వంటి వ్యాధులతో పోలుస్తూ, దానిని నిర్మూలించాలని ఉదయనిధి చేసిన ప్రసంగం ముమ్మాటికీ 'విద్వేషపూరిత ప్రసంగం' కిందకే వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆయన ఉపయోగించిన పదాలు ఒక వర్గం పట్ల ద్వేషాన్ని పెంచేలా ఉన్నాయని, కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ తీర్పు తమిళనాడు రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

...::: తరువాయి 2వ పేజీలో..

## రెగ్యులర్ బెయిల్ కోసం అక్కడికే వెళ్లండి..



హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన లిక్కర్ కేసులో నిందితులకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తమ బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. నిందితుల అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు, అరెస్ట్ నుంచి మాత్రం వారికి మరో నెల రోజుల పాటు మధ్యంతర రక్షణ కల్పించింది. లిక్కర్ కేసులో దర్యాప్తు సంస్థలు నిర్ణీత సమయంలో ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదన్న కారణంతో గతంలో ట్రయల్ కోర్టు ఈ ముగ్గురికి 'డీఫాల్ట్ బెయిల్' మంజూరు చేసింది. అయితే, ఏపీ ప్రభుత్వం దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఆ బెయిల్‌ను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. తాజాగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని

...::: తరువాయి 2వ పేజీలో..



బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్రం బిల్లు | రాజధాని మీద గందరగోళానికి తెర | పన్నెండేళ్లకు సాకారం కాని రాజధాని

# అమరావతికి చట్టబద్ధత

కసరత్తు పూర్తి చేసిన కేంద్ర హోం శాఖ, నీతి ఆయోగ్

అమరావతి (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో దశాబ్ద కాలంగా కొనసాగుతున్న సందిగ్ధతకు ముగింపు పలికేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా గుర్తిస్తూ, దానికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు అవసరమైన బిల్లును రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని కేంద్రం తలపోస్తోంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లో సవరణలు చేసేందుకు కేంద్ర హోంశాఖ కసరత్తును ముమ్మరం చేసింది. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు, హైదరాబాద్‌ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా నిర్ణయించారు. అయితే, ఏపీకి కొత్త రాజధాని ఏది అనే విషయాన్ని విభజన చట్టంలో స్పష్టంగా పేర్కొనలేదు. 2024 జూన్ 2తో హైదరాబాద్ గడువు ముగియడంతో, రాజధాని విషయంలో ఏర్పడిన చట్టపరమైన శూన్యతను భర్తీ చేయడం తప్పనిసరైంది. ఈ నేపథ్యంలో, అమరావతిని రాజధానిగా అధికారికంగా నోటిఫై చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల కేంద్రానికి సమగ్ర నివేదికను సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు, 2024 జూన్ 2 నుంచే అమరావతిని ఏపీ రాజధానిగా పరిగణించేలా చట్టసవరణ చేయనున్నారు. ఇందుకోసం కేంద్ర హోంశాఖ ఇప్పటికే నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి శాఖ, వ్యవసాయ శాఖ, నీతి ఆయోగ్‌ల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ముందుకు తీసుకువెళ్తారు. క్యాబినెట్ ఆమోదం లభించిన

...::: తరువాయి 2వ పేజీలో..

# జనంలోకి జగన్



మూడేళ్ల సమయం ఉంది ధైర్యంగా ఉండండి | నియోజకవర్గ నేతలతో వరుస భేటీలు | భారీ పాదయాత్రకు ముహూర్తం ఖరారు!

తాడేపల్లి (ఏడీఎన్ఎన్):

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2024 ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు మళ్లీ ప్రజల్లోకి వెళ్లాలని ఆయన నిశ్చయించుకున్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. సరిగ్గా ఏడాదిన్నర తర్వాత తాను రాష్ట్రవ్యాప్త పాదయాత్రను ప్రారంభిస్తానని, అప్పటి నుంచి ఎన్నికల వరకు దాదాపు ఏడాదిన్నర పాటు ప్రజల మధ్యే ఉంటానని జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైన విషయాన్ని జగన్ ప్రస్తావన చేశారు. ముఖ్యంగా 'రెడ్ బుక్ రాజ్యాంగం'తో

...::: తరువాయి 2వ పేజీలో..

# రూ. 6,000 కోట్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్



తెలంగాణలో స్లోవాకియా సంస్థ భారీ పెట్టుబడి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సదస్సు వేదికగా తెలంగాణ రాష్ట్రం స్వచ్ఛ ఇంధన రంగంలో మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. స్లోవాకియాకు చెందిన 'న్యూక్లర్ ప్రొడక్ట్స్' సంస్థ తెలంగాణలో 'స్మాల్ మాడ్యులర్ రియాక్టర్' ఆధారిత అణు విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ఆసక్తి వ్యక్తం చేసింది. 600 మిలియన్ యూరోల భారీ పెట్టుబడితో, 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ అత్యాధునిక విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధికారికంగా ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ సమర్పించారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన ఈ భేటీలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి, క్లీన్ ఎనర్జీ

...::: తరువాయి 2వ పేజీలో..

## జిల్లాల రద్దుకు సర్కార్ కుట్ర

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని జిల్లాల రద్దుకు కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరిపాలన సౌలభ్యం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 33 జిల్లాలను రద్దు చేసి, వాటిని పది లేదా పదిహేడు జిల్లాలకు కుదించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆయన ఆరోపించారు. ఈ ప్రమాదాన్ని అడ్డుకోవాలంటే

...::: తరువాయి 2వ పేజీలో..

## సింగరేణి అక్రమాలపై సీబీఐ విచారణ

న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :



దేశ బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కాలరీస్ సంస్థను గత పదేళ్లలో రాజకీయ ప్రయోగశాలగా మార్చి విధ్వంసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు . ఢిల్లీలో మీడియాతో బుధవారం మాట్లాడిన ఆయన, సింగరేణి వ్యవహారాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అవినీతి బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పయనిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా నైనీ కోల్ బ్లాక్ కేటాయింపులు, టెండర్ల ప్రక్రియలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం...

...::: తరువాయి 2వ పేజీలో..



## గగనతలానికి గుడ్‌బై

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ 27 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి ముగింపు పలుకుతూ రిటైర్మెంట్ ప్రకటించారు. కిందటి నెల 27 నుంచే సునీత పదవీవిరమణ అమల్లోకి వచ్చిందని నాసా నిర్వాహకురాలు జారెడ్ ఐజాక్‌మన్ విలియమ్స్ వెల్లడించారు. ఆరవయ్యేళ్ల వయసులో కెరీర్‌కు గుడ్‌బై చెబుతూ, "నా జీవితానికి ఇది చాలనిపిస్తోంది" అని సునీత విలియమ్స్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇరవై ఏడేళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణంలో సునీతా విలియమ్స్ సాధించిన విజయాలను నాసా ప్రస్తుతించింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మూడు మిషన్లను విజయవంతంగా పూర్తి చేసి, నాసా చరిత్రలోనే అత్యంత విజయవంతమైన వ్యోమగాముల్లో ఒకరిగా సునీతా విలియమ్స్ ...

...::: ; సమగ్ర కథనం 2వ పేజీలో..

## 47 మంది కమిషనర్ల బదిలీ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :






రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా, 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని, అలాగే ఒకే చోట మూడేళ్లకు పైగా పనిచేస్తున్న అధికారులను నిబంధనల ప్రకారం బదిలీ చేస్తున్నట్లు, పురపాలక పరిపాలన శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిపాలనా కారణాలతో పాటు పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఈ బదిలీల ప్రక్రియను చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ బదిలీలలో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్ రాజు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా, క్యాతనపల్లి నుంచి జి. రాజు ఆదిలాబాద్ కమిషనర్‌గా నియమితులయ్యారు. అలాగే నల్గొండ నుంచి ముసాబ్ అహ్మద్ హుజూరాబాద్‌కు, ఆలేరు నుంచి బి. శ్రీనివాస్ హుజూర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. పదోన్నతులు పొందిన వారిలో డి. జైత్రమ్ జహీరాబాద్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసీ నుంచి బి. శరత్ చంద్ర నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు.

## దావోస్‌లో కూడా పాత పాటే..

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



గతేడాది మే నెలలో నాలుగు రోజుల పాటు జరిగిన భారత్-పాకిస్తాన్ యుద్ధాన్ని తానే ఆపినట్టు, దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై మూడవ పక్ష జోక్యం లేదని భారత్ మొదటి నుంచి చెబుతోందని ట్రంప్ ప్రస్తావించడం కొసమెరుపు. భారత్-పాక్‌లతో సహా ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఎనిమిది యుద్ధాలను నిలిపివేశానని ఆయన పునరుద్ఘాటించారు. గత 35 ఏళ్లుగా కొనసాగుతున్న ఆర్మేనియా-అజర్‌బైజాన్ ఘర్షణను ఒక్క రోజులో పరిష్కరించానని ట్రంప్ వ్యాఖ్యనించారు. స్విట్జర్లాండ్‌లోని అందమైన దావోస్ నగరానికి మళ్లీ రావడం ఆనందంగా ఉందని ట్రంప్ అన్నారు. ఆర్మేనియా-అజర్‌బైజాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించిన సందర్భంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తనకు ఫోన్ చేసి ఆశ్చర్యం వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. "మీరు యుద్ధాలు ఆపారంటే నమ్మలేకపోతున్నాను," అని పుతిన్

...::: తరువాయి 2వ పేజీలో..





## వెండే బంగారమాయేగా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

బంగారం, వెండి ధరలు రోజురోజుకీ పెరుగుతూ కొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. ఇప్పటికే లక్షన్నర మార్క్‌ను దాటిన 24 కారెట్ల మేలిమి బంగారం ధర తాజాగా మరోసారి భారీ షాక్ ఇచ్చింది. బుధవారం హైదరాబాద్ మార్కెట్లో ఉదయం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర ఏకంగా రూ.1.61 లక్షలకు చేరింది. కిందటి రోజు ధర రూ.1,52,800తో పోలిస్తే, దాదాపు రూ.9,000 పెరిగింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,900గా నమోదైంది. మరోవైపు వెండి ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. మార్కెట్లో కిలో వెండి ధర రూ.3,30,000కు చేరింది. ఒక్కరోజులోనే వెండి ధర దాదాపు రూ.14 వేలు పెరగడం బులియన్ మార్కెట్‌లో సంచలనంగా మారింది. పారిశ్రామిక లోహంగా ఉన్న వెండిపై డిమాండ్ భారీగా పెరగడంతో ధరలు వేగంగా ఎగబాకుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోనూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలను

...::: తరువాయి 2వ పేజీలో..

## 16 మంది అధికారులకు ఐఏఎస్ హోదా






కేంద్ర ప్రభుత్వ గెజిట్ విడుదల

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఐఏఎస్ హోదా కోసం ఎదురుచూస్తున్న 16 మంది అధికారులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2022, 2023 ,2024 సంవత్సరాలకు సంబంధించి వివిధ కేటగిరీల కింద ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ, ఎంపిక చేసిన ఈ అధికారులను తెలంగాణ క్యాడర్‌కు కేటాయిస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ నియామకాల్లో భాగంగా 2022 సెలక్షన్ లిస్ట్ నుంచి 11 మంది, 2023 నుంచి ముగ్గురు , 2024 నుంచి ఇద్దరు అధికారులకు పదోన్నతులు లభించాయి.

...::: తరువాయి 2వ పేజీలో..



## చెరువులో కూలిన వాయుసేన విమానం!

అలహాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నగరంలో బుధవారం మధ్యాహ్నం పెను విమాన ప్రమాదం తప్పింది. భారత వాయుసేనకు చెందిన ఒక మైక్రోలైట్ శిక్షణ విమానం సాంకేతిక లోపంతో నగరం నడిబొడ్డున ఉన్న ఒక చెరువులో కుప్పకూలింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపినప్పటికీ, విమానంలోని ఇద్దరు పైలట్లు ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తన సాధారణ శిక్షణలో భాగంగా ఈ విమానం ప్రయాగ్‌రాజ్ గగనతలంపై ఎగురుతోంది. నగరంలోని కేపీ కాలేజీ వెనుక భాగంలో ప్రయాణిస్తుండగా, ఒక్కసారిగా సాంకేతిక లోపం తలెత్తి విమానం పైలట్ నియంత్రణ కోల్పోయింది. క్షణాల వ్యవధిలోనే విమానం వేగంగా కిందికి వచ్చి కాలేజీ సమీపంలోని చెరువులో పడిపోయింది. ..

...::: తరువాయి 2వ పేజీలో..

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
22.01.2026
www.manasarkar.com



# ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్

**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్) :**

కేరళలో బస్సు ప్రయాణంలో దీపక్ (42) అనే వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఇన్‌ఫ్లుయెన్సర్ షింజితా ముస్తఫా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వైరల్ కావడంతో, తీవ్ర అవమానానికి గురైన దీపక్ తాను నిర్దోషినని చెబుతూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల16న జరిగిన ఈ ఘటనపై దీపక్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్పందించిన పోలీసులు, ఆత్మహత్యకు ప్రేరేపించిందన్న ఆరోపణపై షింజితాను బుధవారం అరెస్టు చేయగా, మెజిస్ట్రేట్ ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు.

## దావోస్‌లో కూడా
# పాత పాటే..

**మొదటి పేజీ తరువాయి...**

అన్నట్లు ట్రంప్ వెల్లడించారు. ఆ విషయం తనకే వదిలేసి, ఉక్రెయిన్ యుద్ధంపై దృష్టి పెట్టాలని పుతిన్‌ను తాను కోరినట్లు తెలిపారు. అమెరికాలో తన పాలనలో ఎన్నో మంచి పనులు చేశామని, ప్రతి దేశం తమతో కలిసి రావాలని కోరుకుంటోందని అన్నారు. ఎవరినీ నాశనం చేయాలనే ఉద్దేశం లేదని స్పష్టం చేస్తూనే.. వాణిజ్య లోటును మాత్రం తప్పకుండా తిరిగి చెల్లించాల్సిందేనని ట్రంప్ హెచ్చరించారు.

## రెగ్యులర్ బెయిల్ కోసం
# అక్కడికే వెళ్లండి..

**మొదటి పేజీ తరువాయి...**

ధర్మాసనం ఈ కేసును విచారించి, హైకోర్టు ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ నిందితుల పిటిషన్‌ను కొట్టివేసింది. నిందితులు తమకు బెయిల్ కావాలంటే సంబంధిత ట్రయల్ కోర్టులోనే 'రెగ్యులర్ బెయిల్' పిటిషన్ వేసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని, నేరుగా ఇక్కడ ఉపశమనం పొందలేరని స్పష్టం చేసింది. ఒకవేళ ట్రయల్ కోర్టులో బెయిల్ రాకపోతే, తిరిగి హైకోర్టును ఆశ్రయించేందుకు వారికి వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతానికి నిందితులకు తక్షణ అరెస్ట్ ముప్పు లేకుండా సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించింది. గత ఏడాది నవంబర్ 26న ఇచ్చిన మధ్యంతర రక్షణ ఉత్తర్వులు మరో నాలుగు వారాల పాటు కొనసాగుతాయని కోర్టు తెలిపింది. ఈ గడువులోగా నిందితులు ట్రయల్ కోర్టులో బెయిల్ కోసం ప్రయత్నించుకోవచ్చు. దీనివల్ల నిందితులకు మరో నెల రోజుల పాటు జైలుకు వెళ్లకుండా తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది.

## డిప్యూటీ సీఎం
# మాట్లాడింది తప్పే

**మొదటి పేజీ తరువాయి...**

కేసు వివరాల్లోకి వెళితే.. 2023లో జరిగిన ఒక సదస్సులో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని సమూలంగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడమే కాకుండా పలు కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ ఈ పిటిషన్లపై విచారణ జరిపింది . డీఎంకే పార్టీ దశాబ్దాలుగా ఒక నిర్దిష్ట మతంపై విమర్శలు చేస్తోందని, మంత్రి కూడా అదే సైద్ధాంతిక మూలాల నుంచి వచ్చినందున ఇటువంటి వ్యాఖ్యలు చేశారని అభిప్రాయపడింది. "సనాతన ఒజిప్పు" అనే తమిళ పదం సంస్కృతిని అంతం చేయడమేనని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్ట విరుద్ధమని కోర్టు పేర్కొంది. విద్వేష ప్రసంగాలు ప్రారంభించిన వారిపై చట్టం కఠినంగా అమలు కావడం లేదని, వాటిపై స్పందించిన వారే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హైకోర్టు బెంచ్ ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయనిధి చేసిన ప్రసంగానికి సంబంధించి తమిళనాడులో ఎటువంటి కేసు నమోదు కాకపోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో హైకోర్టు వెలువరించిన ఈ తీర్పు ఉదయనిధికి మరియు డీఎంకే ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో తన వ్యాఖ్యలను సమర్థించుకున్న ఉదయనిధి, తాజా కోర్టు తీర్పుపై ఎలా స్పందిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మేయర్ పీఠం వారికే !

**మొదటి పేజీ తరువాయి...**

సంఖ్యాబలం తక్కువగా ఉన్నప్పటికీ శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే ఇంకా రేసులో ఉన్నారు. ఆయన 'అంతా దైవ నిర్ణయం' అని వ్యాఖ్యానించడం వెనుక ఒక బలమైన రాజకీయ వ్యూహం ఉంది. ఒకవేళ మేయర్ పదవి ఎస్సీ వర్గానికి రిజర్వ్ అయితే, మహాయుతి కూటమిలో ఆ వర్గానికి చెందిన కార్పొరేటర్లు ఎవరూ లేరు. అదే సమయంలో ఉద్ధవ్ థాకరే వర్గంలో జితేంద్ర వాల్వీ, ప్రియదర్శిని ఠాక్రే వంటి ఎస్సీ సామాజిక వర్గ కార్పొరేటర్లు ఉన్నారు. ఈ పరిస్థితి వస్తే, విపక్షాల మద్దతుతో ఉద్ధవ్ వర్గం మేయర్ పీఠాన్ని దక్కించుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు, బీజేపీ షిండే వర్గం తమ కార్పొరేటర్లు చేజారిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే ఏక్‌నాథ్ షిండే తన కార్పొరేటర్లతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. రిజర్వేషన్ జనరల్ లేదా ఓబీసీ కేటగిరీకి వస్తే మాత్రం బీజేపీకి మేయర్ పదవి దక్కడం ఖాయం. కానీ, ఒకవేళ లాటరీలో అనూహ్య మార్పులు జరిగితే మాత్రం 30 ఏళ్ల తర్వాత బీఎంసీపై పట్టు కోల్పోయిన థాకరే కుటుంబానికి 'మాతోశ్రీ'కి మళ్ళీ పవర్ చేరే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో రేపు జరగబోయే లాటరీ ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# దక్షిణాదిపై బీజేపీ నజర్

**మొదటి పేజీ తరువాయి..**

ఇప్పటికే తెలంగాణలో వార్డుల విభజన, మేయర్, చైర్‌పర్సన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. 2011 జనాభా లెక్కలు, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ రిజర్వేషన్లను ఖరారు చేయగా, మహిళలకు 50 శాతం కోటాను అమలు చేస్తున్నారు. మరోవైపు కేరళ అసెంబ్లీ ఎన్నికల కోసం జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావడేను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆయనకు సహ ఇన్‌ఛార్జ్ గా వ్యవహరిస్తారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల బాధ్యతలను కూడా తావడేకే అప్పగించారు. మహారాష్ట్ర విజయం ఇచ్చిన ఉత్సాహంతో, ఈ రెండు రాష్ట్రాల్లోనూ జయకేతనం ఎగురవేయాలని బీజేపీ పట్టుదలతో ఉంది. బ్యాలెట్ పేపర్ల ద్వారా బెంగళూరు ఎన్నికలు జరగనుండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# థాక్రేతో కలిసి బీజేపీకి షిండే సడెన్ షాక్..!

**ముంబై (ఏడీఎన్ఎన్) :**



మహారాష్ట్రలో జరిగిన ముంబై మున్సిపల్ ఎన్నికల్లో బీఎంసీ మేయర్ పీఠంపై రాష్ట్ర రాజకీయాల్లో హీట్ మరింత పెరుగుతోంది. బీజేపీ-శివసేన కూటమి మెజార్టీ స్థానాలు వచ్చినా క్షేత్రస్థాయిలో మాత్రం సమీకరణాలు మారిపోతున్నాయి . బీజేపీపై అసంతృప్తితో ఉన్న ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన... అనూహ్యంగా రాజ్ థాక్రే నేతృత్వంలోని ఎంఎన్ఎస్‌తో కలిసి కాషాయ పార్టీకి బిగ్ షాక్ ఇచ్చింది. షిండే కంచుకోటగా భావించే కళ్యాణ్-డోంబివ్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ భారీగా 50 సీట్లు గెలుచుకుంది. షిండే శివసేన 53 సీట్లు దక్కించుకోగా, ఎంఎన్ఎస్ ఐదు సీట్లు గెలుచుకుంది. ఉద్ధవ్ థాకరే వర్గానికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 122 సభ్యులున్న కేడీఎంసీలో మేయర్ పదవికి కావాల్సిన మ్యాజిక్ నంబర్ 62. బీజేపీ కంటే మూడు సీట్లు ఎక్కువగా గెలిచిన షిండే సేన... మేయర్ పదవి తమకే ఇవ్వాలని డిమాండ్ చేసింది. మేయర్ పీఠం కావాలని పట్టుబట్టిన శివసేన ప్రతిపాదనను బీజేపీ ఈ ప్రతిపాదనకు అంగీకరించలేదు. దీంతో చేసేదిలేక షిండే సేన బీజేపీకి దూరంగా నిలిచి , రాజ్ థాక్రే ఎంఎన్ఎస్‌తో కలిసి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. షిండే సేనకు ఉన్న 53 సీట్లకు ఎంఎన్ఎస్ ఐదు సీట్లు కలిస్తే సంఖ్య 58కి చేరుతుంది. దీనికి ఉద్ధవ్ సేనకు చెందిన నలుగురు కార్పొరేటర్లు మద్దతివ్వనున్నట్లు సమాచారం. దీంతో షిండే వర్గం మేయర్ పదవిని దాదాపు ఖరారు చేసుకున్నట్టే కనిపిస్తోంది. ఇలాంటి పరిణామాలు భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. మరోవైపు అంబర్‌నాథ్, అకోలా మునిసిపల్ కౌన్సిల్‌లలోనూ బీజేపీ తీసుకున్న పొత్తులు చర్చనీయాంశంగా మారాయి. అంబర్‌నాథ్‌లో కాంగ్రెస్‌తో, అకోలాలో ఎంఐఎంతో బీజేపీ జతకట్టడం వివాదానికి దారి తీసింది. దీనిపై పార్టీ హైకమాండ్ కఠినంగా స్పందించగా , అంబర్‌నాథ్‌లో కాంగ్రెస్ తన 12 మంది కార్పొరేటర్లను సస్పెండ్ చేసింది. మహారాష్ట్ర రాజకీయాల్లో స్థానిక ఎన్నికల ప్రభావం ఎంత లోతుగా ఉందో తెలుస్తోంది.

# దేశ రాజధానిలో విధ్వంసానికి ఉగ్ర కుట్ర

### నిఘా వర్గాల హెచ్చరికతో ఢిల్లీలో హై అలర్ట్

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**




గణతంత్ర దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతున్న తరుణంలో, భారత వ్యతిరేక శక్తులు మరోసారి పంజా విసిరేందుకు కుట్ర పన్నుతున్నాయి. రాజధాని ఢిల్లీని రక్తసిక్తం చేయడమే లక్ష్యంగా ఉగ్రవాద సంస్థలు భయంకరమైన వ్యూహాన్ని రచించినట్లు జాతీయ నిఘా వర్గాలు హెచ్చరించాయి. జనవరి 26ను పురస్కరించుకుని ఈ దాడులకు ప్లాన్ చేయడంతో, దీనికి ఉగ్రవాదులు 'కోడ్ నేమ్ 2626' అని పేరు పెట్టినట్లు సమాచారం. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ అండదండలతో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ఈ ఘాతుకానికి స్కెచ్ వేసినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కేవలం ఢిల్లీ మాత్రమే కాకుండా, జమ్మూ కాశ్మీర్ , అయోధ్యలోని రామ మందిరం కూడా వీరి హిట్ లిస్టులో ఉన్నట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల ద్వారా రాడికలైజ్ అయిన యువతను ,స్థానిక గ్యాంగ్‌స్టర్లను ఉపయోగించి 'లోన్ ఉల్ఫ్'దాడులకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఉగ్రవాద ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో ఢిల్లీ పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నగరమంతటా కీలక ఉగ్రవాదుల ఫొటోలతో కూడిన 'వాంటెడ్' పోస్టర్లను ప్రదర్శిస్తూ గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రధానంగా అల్‌ఖైదాకు చెందిన ఢిల్లీ నివాసి మొహమ్మద్ రెహాన్, అలాగే బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడులో కీలక సూత్రధారిగా భావిస్తున్న షాహిద్ ఫైసల్ వంటి ముష్కరులు నగరంలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నారు. వీరితో పాటు మరికొందరు అనుమానిత ఉగ్రవాదుల కదలికలపై నిఘా ఉంచుతూ, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు మరియు రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలను ఉధృతం చేశారు. మరోవైపు, వేడుకలు జరిగే కర్తవ్య పథ్, చారిత్రక ఎర్రకోట పరిసరాల్లో అంగుళం అంగుళం నిఘా ఏర్పాటు చేస్తూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీ గగనతలంలో డ్రోన్లు, పారాగ్లైడర్లు వంటి వాటిపై నిషేధం విధిస్తూ నగరాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించారు. గణతంత్ర పరేడ్ సమయంలో ఆకాశంలో పక్షుల వల్ల ఎయిర్ ఫోర్స్ విన్యాసాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండటం కోసం, డేగలకు ప్రత్యేకంగా ఆహారం వేసి వాటిని పక్కదారి మళ్లించే వినూత్న పద్ధతులను కూడా భద్రతా దళాలు అనుసరిస్తున్నాయి. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, ఏదైనా అనుమానాస్పద వస్తువు లేదా వ్యక్తి కనిపిస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# 'విజయ్' ప్రభంజనం ఎవరికి చెక్?

**చెన్నై (ఏడీఎన్ఎన్) :**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ ద్రవిడ గడ్డపై రాజకీయ వేడి రాజుకుంటోంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే పట్ల సహజంగానే కొంత ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నప్పటికీ, విపక్షాల మధ్య ఉన్న చీలికలు మళ్లీ ఎం.కె. స్టాలిన్‌కే పట్టం కట్టేలా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కొత్తగా రంగ ప్రవేశం చేసిన సూపర్ స్టార్ విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం' పార్టీ ఏ పార్టీ ఓట్లను చీలుస్తుందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దళపతి విజయ్ పార్టీ పెట్టినప్పటి నుండచి ప్రజల్లో భారీ ఆదరణ కనిపిస్తోంది.ఆయన సభలకు వచ్చే జనసందోహం చూస్తుంటే ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం, జనసేన పార్టీల ప్రారంభ సమయంలో ఉన్న ఉత్సాహం గుర్తుకొస్తోంది. అయితే, కేవలం జనం రావడమే ఓట్లుగా మారతాయా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. 2009లో ప్రజారాజ్యం పార్టీకి భారీగా జనం వచ్చినా,చివరికి ఆ ఓట్లు విపక్షాల మధ్య చీలిపోయి అధికార పక్షానికే మేలు చేశాయి. తమిళనాడులో కూడా విజయ్ చీల్చే వ్యతిరేక ఓటు అంతిమంగా డీఎంకేకు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ప్రస్తుతం విజయ్ ఒంటరిగానే పోటీ చేస్తానని ప్రకటించడం విపక్షమైన అన్నా డీఎంకేను మరింత బలహీనపరిచే ప్రమాదం కనిపిస్తోంది. జయలలిత మరణం తర్వాత అన్నా డీఎంకే అనేక వర్గాలుగా విడిపోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్‌గా మారింది. ఎడప్పాడి పళనిస్వామి, పన్నీర్ సెల్వం, దినకరన్ వంటి నేతల మధ్య ఆధిపత్య పోరు ఆ పార్టీని కుంగదీస్తోంది. ఒక పక్క పార్టీని ఏకం చేసే సమర్థవంతమైన నాయకుడు లేకపోవడం, మరోపక్క అంతర్గత కుమ్ములాటల వల్ల ఆ పార్టీ గ్రాఫ్ క్రమంగా పడిపోతోంది. ఈ పరిస్థితులు అధికార డీఎంకేకు పరోక్షంగా లాభం చేకూరుస్తున్నాయి. బలమైన కేడర్, క్షేత్రస్థాయిలో పట్టు ఉండటం వల్ల స్టాలిన్ ప్రభుత్వం మళ్లీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని తాజా అంచనాలు సూచిస్తున్నాయి. అయితే, రాజకీయాల్లో ఎప్పుడైనా సమీకరణాలు మారవచ్చు. ఒకవేళ చివరి నిమిషంలో అన్నా డీఎంకే, విజయ్ పార్టీ పొత్తు పెట్టుకుంటే మాత్రం ఫలితాలు తలకిందులయ్యే అవకాశం ఉంది. ఈ రెండు శక్తులు కలిస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏకమై అధికార మార్పిడికి బాటలు పడతాయి. మరోవైపు, బీజేపీ కూడా విజయ్ లేదా దినకరన్ వంటి వారిని కలుపుకొని ఏదైనా 'మాస్టర్ ప్లాన్' వేస్తే ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారుతుంది. ఏది ఏమైనా 2026 ఎన్నికలు తమిళనాడు భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపు కానున్నాయి.

**- జాని మస్తాన్**

# వెండే బంగారమాయేగా

**మొదటి పేజీ తరువాయి...**

తాకుతున్నాయి. ఔన్సు వెండి ధర చరిత్రలో తొలిసారి 94 డాలర్లను దాటి ట్రేడవుతోంది. అదే సమయంలో ఔన్సు బంగారం ధర 4,849 డాలర్లకు చేరి కొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఈ లోహాల ధరలను మరింత పైకి నెట్టుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్ లాండ్ స్వాధీనం చేసుకుంటానని బెదిరించడం, గాజా శాంతి మండలిలో సభ్యత్వ అంశాల్లో సహకరించడం లేదంటూ ఐరోపా దేశాలు ఫ్రాన్స్ పై భారీ సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించడం వాణిజ్య యుద్ధ భయాలను మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. ఈ పరిణామాలతో అంతర్జాతీయంగా ఆర్థిక అస్థిరత పెరగడంతో మదుపర్లు బంగారం, వెండిని సురక్షిత పెట్టుబడి సాధనాలుగా ఎంచుకుంటున్నారు. ఇక వెండికి మరోవైపు కొత్త ఇంధన రంగాలు, విద్యుత్తు వాహనాల తయారీ పరిశ్రమల నుంచి భారీ డిమాండ్ ఏర్పడుతోంది. సోలార్ ప్యానెల్స్, బ్యాటరీ టెక్నాలజీలో వెండి వినియోగం పెరగడంతో గిరాకీ మరింత పెరిగిందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు, పారిశ్రామిక అవసరాలు కలిసి బంగారం, వెండి ధరలను రికార్డు స్థాయికి తీసుకెళ్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# జనంలోకి జగన్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతిపక్ష నేతలను వేధిస్తున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి ఇంకా రెండు బడ్జెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని,ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నందున క్యాడర్ ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇక నుంచి ప్రతి శనివారం ఒక నియోజకవర్గానికి చెందిన నేతలు,కార్యకర్తలతో ముఖాముఖి సమావేశమవుతానని,ఈ కార్యక్రమాన్ని ఏలూరు నుంచే శ్రీకారం చుట్టామని వెల్లడించారు.కూటమి పాలనలో ఆరోగ్యశ్రీ కనుమరుగైందని, 108 ,104 వ్యవస్థలను నిర్వీర్యం చేశారని జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, చంద్రబాబు నాయుడు తన వాగ్దానాలతో ప్రజలను వంచించారని ధ్వజమెత్తారు. "జగన్ ఉన్నప్పుడే పథకాలు బాగుండేవి" అని ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు చర్చ జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. పోలీసులు కూడా వ్యవస్థలను కాపాడటంలో విఫలమయ్యారని, కేవలం రాజకీయ ప్రతీకార చర్యలకే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2017లో చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' వైసీపీకి అద్భుత విజయాన్ని తెచ్చిపెట్టింది. అప్పట్లో 3,648 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర జగన్ మోహన్ రెడ్డి ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. ఇప్పుడు 2024 పరాజయం తర్వాత మళ్లీ అదే ఫార్ములాను నమ్ముకుని, ఎన్నికలకు రెండేళ్ల ముందే జనంలోకి వెళ్లాలని ఆయన ప్లాన్ చేస్తున్నారు. 2023లో కూడా యాత్ర ముగింపు దశలో ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రకటనతో వైసీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# రూ. 6,000 కోట్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. 2047 నాటికి నిర్దేశించుకున్న నెట్ జీరో లక్ష్య సాధనలో ఇటువంటి అత్యాధునిక సాంకేతికత కలిగిన ప్రాజెక్టులు రాష్ట్రానికి అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. పర్యావరణహితమైన శక్తి వనరులను ప్రోత్సహించే క్రమంలో ఈ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వీటికి అవసరమైన మౌలిక వసతులు సహకారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే, దక్షిణ భారతదేశంలోనే ఒక వినూత్నమైన మార్పుకు తెలంగాణ వేదిక కానుంది. సంప్రదాయ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల కంటే ఇవి సురక్షితమైనవి మరియు తక్కువ విస్తీర్ణంలోనే అత్యధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలవు. ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, సీఈఓ అనిల్ కుమార్ బావిసెట్టి నేతృత్వంలోని బృందం రాష్ట్రంలోని అనుకూలతలపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో విద్యుత్ కొరత తీరడమే కాకుండా, గ్రీన్ ఎనర్జీ వినియోగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ అణు విద్యుత్ కేంద్రం రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి కొత్త జవజీవాలను అందిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## సింగరేణి అక్రమాలపై
# సీబీఐ విచారణ

**మొదటి పేజీ తరువాయి...**

ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వమే కనుక సింగరేణిలో జరిగిన అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు కోరుతూ ముందుకు వస్తే, కేంద్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. నైనీ కోల్ బ్లాక్ కేటాయింపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో నైనీ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో అప్పటి ముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకుని రద్దు చేశారని, సింగరేణి స్వయంగా మైనింగ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బొగ్గు గనుల కొరత తీవ్రంగా ఉన్న తరుణంలో ప్రభుత్వ సంస్థను కాదని ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి భవిష్యత్తును కాపాడాలంటే గతంలో జరిగిన అక్రమాలన్నీ బయటకు రావాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణికి ఆర్థిక ఇబ్బందులు పెరిగాయని, రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని కిషన్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర విద్యుత్ సంస్థల అవసరాల కోసం కేంద్రం అన్ని విధాలా సహకరిస్తున్నప్పటికీ, రాష్ట్రంలోని ప్రభుత్వాలు మాత్రం సింగరేణిని ఒక రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పారదర్శకత రావాలంటే స్వతంత్ర సంస్థతో విచారణ జరగాలని, రాష్ట్రం నుంచి విన్నపం వస్తే సీబీఐ దర్యాప్తుకు తాము సిద్ధమని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## చెరువులో కూలిన
# వాయుసేన విమానం!

**మొదటి పేజీ తరువాయి..**

ఆ సమయంలో భారీ శబ్దం రావడంతో కాలేజీ విద్యార్థులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న కాలేజీ విద్యార్థులు అద్భుతమైన సాహసాన్ని ప్రదర్శించారు. విమానం చెరువులోని బురదలో కూరుకుపోవడాన్ని గమనించిన విద్యార్థులు, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నీటిలోకి దూకారు. ప్రాణాలకు తెగించి విమానంలో చిక్కుకున్న ఇద్దరు పైలట్లను సురక్షితంగా బయటకు తీశారు. "మేము క్యాంపస్‌లో ఉన్నప్పుడు రాకెట్ లాంటి శబ్దం వినిపించింది. పరుగెత్తుకుంటూ వెళ్లి చూస్తే విమానం బురదలో పడి ఉంది. ఏమీ ఆలోచించకుండా లోపలికి దూకి పైలట్లను రక్షించాం" అని ప్రత్యక్ష సాక్షి పదం సింగ్ మీడియాకు వివరించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వాయుసేన అధికారులు మరియు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పైలట్లకు స్వల్ప గాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఈ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ జనసాంద్రత కలిగిన నివాస ప్రాంతాల్లో పడి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదని, అది చెరువులో పడటంతో పెను ముప్పు తప్పిందని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం క్రేన్ల సహాయంతో విమానాన్ని బయటకు తీసేందుకు రెస్క్యూ టీమ్‌లు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు భారత వాయుసేన ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించింది. పైలట్లను కాపాడిన విద్యార్థుల సాహసాన్ని అధికారులు , నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## 16 మంది అధికారులకు
# ఐఏఎస్ హోదా

**మొదటి పేజీ తరువాయి...**

2022 జాబితాలో డి. మధుసూదన్ నాయక్, ఎం. సత్యవాణి, జె. భవానీ శంకర్, జి. లింగయ్య నాయక్, ఎ. నరసింహా రెడ్డి, జి. వీరారెడ్డి, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, యు. రఘురామ్ శర్మ, పి. చంద్రయ్య, జి. ముకుంద రెడ్డి , ఎ. భాస్కర్ రావు ఉన్నారు. 2023 జాబితాలో వై.వి. గణేష్, అబ్దుల్ హమీద్, బి. వెంకటేశ్వర్లు ఎంపిక కాగా, 2024 జాబితాలో ఎన్. ఖీమ్యా నాయక్, కె. గంగాధర్ ఐఏఎస్ హోదా పొందారు. అయితే, ఈ నియామకాలు ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ తుది తీర్పునకు లోబడి ఉంటాయని కేంద్ర ప్రభుత్వం తన గెజిట్‌లో స్పష్టం చేసింది. పదోన్నతులు పొందిన అధికారులకు త్వరలోనే కొత్త బాధ్యతలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది.

# అమరాతికి చట్టబద్ధత

**మొదటి పేజీ తరువాయి...**

వెంటనే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. గత ఐదేళ్లలో 'మూడు రాజధానుల' ప్రతిపాదనతో అమరావతి భవితవ్యంపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇప్పుడు పార్లమెంట్‌లో చట్టసవరణ జరిగి అమరావతికి చట్టబద్ధత లభిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం మారినా రాజధానిని మార్చే అవకాశం ఉండదు. ఇది రాజధాని కోసం భూములిచ్చిన వేలాది మంది రైతులకు గొప్ప ఊరటనివ్వడమే కాకుండా, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు మరియు ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలకు గట్టి భరోసాను ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చట్టపరమైన రక్షణతో అమరావతి నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## జిల్లాల రద్దుకు
# సర్కార్ కుట్ర

**మొదటి పేజీ తరువాయి...**

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించడమే ఏకైక మార్గమని కేటీఆర్ పిలుపునిచ్చారు. సీఎం ఇప్పటివరకు 62 సార్లు ఢిల్లీకి వెళ్లారని , అది రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని , కేవలం తన కుర్చీని కాపాడుకోవడానికేనని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి మూటలు మోయడంలో బిజీగా ఉంటే, బీజేపీ నేతలు అమిత్ షా వంటి నాయకుల చెప్పులు మోస్తున్నారని ఎద్దేవా చేశారు. ఢిల్లీ పార్టీల చేతిలో అధికారం పెడితే తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ, సిరిసిల్ల, వనపర్తి వంటి జిల్లాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని, జిల్లాల రద్దు జరిగితే ప్రజలు మళ్లీ పాత ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో పాలన తుగ్లక్ నిర్ణయాలతో సాగుతోందని కేటీఆర్ ఆరోపించారు . సినిమా టికెట్ల ధరల పెంపు, సింగరేణి సంస్థ నిర్వీర్యం వంటి అంశాలపై మంత్రులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. శివరాత్రి లోపు మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఈ ఎన్నికల్లో జిల్లాల రద్దు అంశాన్నే ప్రధాన అస్త్రంగా చేసుకుని ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో 40 శాతం మెజారిటీ సాధించామని, అదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ విజయభేరీ మోగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చెన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు ఈ సందర్భంగా కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# గగనతలానికి గుడ్‌బై

**మొదటి పేజీ తరువాయి...**


నిలిచారు. ఆమె ఎందరో యువ వ్యోమగాములకు ఆమె మార్గదర్శకురాలయ్యారు. రెండు దేశాలకు కీర్తి పతాకగా నిలుస్తూ, అంతరిక్ష రంగంలో ఎన్నో అరుదైన విజయాలను తన ఖాతాలో వేసుకున్నారు. 1965 సెప్టెంబర్ 19న ఒహాయోలో జన్మించిన సునీతా... భారత సంతతికి చెందిన న్యూరో అనాటమిస్ట్ దీపక్ పాండ్యా, స్లోవీన్ అమెరికన్ ఉర్సులైన్ బోనీల కుమార్తె. పాండ్యా దంపతులకు ముగ్గురు సంతానం కాగా , సునీత చిన్న కుమార్తె. గుజరాత్‌లో జన్మించిన దీపక్ పాండ్యా 1958లో అమెరికాకు వలస వెళ్లారు. అక్కడే సునీత విద్యాభ్యాసం పూర్తి చేసి, నాసా ఎత్తుకు ఎదిగారు. రికార్డులన్నీ ఆమెవే. 1998లో నాసాకు ఎంపికైన సునీతా , 27 ఏళ్ల పాటు సేవలందించారు. మూడు అంతరిక్ష యాత్రల్లో పాల్గొని, భూమికి దూరంగా నింగిలో మొత్తం 608 రోజులు గడిపారు. నాసా చరిత్రలో అత్యధిక కాలం అంతరిక్షంలో ఉన్న వ్యోమగాముల్లో రెండో స్థానంలో నిలిచారు. మహిళా వ్యోమగామిగా అత్యధికంగా తొమ్మిది సార్లు స్పేస్‌వాక్‌లు చేసి (62 గంటల 6 నిమిషాలు) అరుదైన రికార్డు నెలకొల్పారు. అంతరిక్షంలో మారథాన్ రన్ చేసిన తొలి వ్యక్తిగా కూడా చరిత్ర సృష్టించారు. సునీత 2024లో పట్టుదలకు చిరునామాగా నిలిచిన ఘట్టం చోటుచేసుకుంది. కేవలం వారం రోజుల మిషన్‌గా వెళ్లిన సునీతా , సాంకేతిక సమస్యల కారణంగా 286 రోజులు అంతరిక్షంలోనే ఉండిపోయారు. బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌లో బుచ్ విల్‌మోర్‌తో కలిసి తొమ్మిది నెలలపాటు శూన్యంలో జీవించారు. భారరహిత స్థితి, పరిమిత ఆక్సిజన్, తినడం నుంచి నిద్ర వరకు ప్రతిదీ సవాలే. 59 ఏళ్ల వయసులో ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొని, అనుభవంతో కూడిన సంయమనం, అపారమైన ధైర్యంతో భూమికి తిరిగొచ్చారు. సమస్యలకు వెన్నుచూపని దృఢచిత్తం, భవితపై నమ్మకం సునీతా విజయానికి మూలాధారాలు. “మనసే మన నేస్తం... అదే మన శత్రువు కూడా” అన్న గీతా సందేశాన్ని ఆచరణలో పెట్టి, మనసును బుద్ధిని అదుపులో పెట్టుకుని విజయం సాధించిన మహిళ సునీతా విలియమ్స్. గగనతలానికి ఆమె గుడ్‌బై చెప్పినా , ఆమె ప్రేరణ స్పేస్ కు సంబంధించి తరతరాలకు దిక్సూచి అవుతుంది.



## దావోస్‌లో ట్రంప్ పై ఫ్రాన్స్ నిరసన

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

గ్రీన్‌లాండ్ అంశంలో ఐరోపా దేశాలు మద్దతివ్వడం లేదన్న అసంతృప్తితో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై ఒత్తిడి పెంచుతున్నట్లు పరిస్థితులు సూచిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఫ్రాన్స్ పై 200 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించడంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన ట్రంప్ వైఖరిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచం నిబంధనల్లేని దశలోకి అడుగుపెడుతోందని మెక్రాన్ హెచ్చరించారు. సుంకాలను ఆయుధాలుగా మార్చి ఐరోపాను అణిచివేయాలని అమెరికా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాలు బలవంతుల ఇష్టానుసారంగా మారుతున్నాయని, సామ్రాజ్యవాద ధోరణులు మళ్లీ తలెత్తుతున్నాయని విమర్శించారు. ట్రంప్ విధిస్తున్న అన్యాయమైన సుంకాలు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. బెదిరింపుల కంటే గౌరవానికే తాము ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే 'ట్రేడ్ బజూకా'ను అమలు చేయడంలో వెనుకాడొద్దని ఐరోపా కూటమికి పిలుపునిచ్చారు. అలా చేస్తే అమెరికాపై 81 బిలియన్ పౌండ్ల మేర సుంకాలు పడతాయని, ఇది ట్రంప్ వైఖరిని మార్చేందుకు దోహదపడుతుందని మెక్రాన్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ గ్రీన్‌లాండ్ విషయంలో అనుసరిస్తున్న విధానాలను కెనడా కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ దావోస్‌లో మాట్లాడుతూ గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. నాటో ఒప్పందంలోని ఆర్టికల్-5ను గుర్తుచేస్తూ.. ఒక సభ్య దేశంపై దాడి జరిగితే మొత్తం కూటమిపై దాడి చేసినట్లేనని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా దావోస్‌లో ట్రంప్ ప్రసంగానికి ముందే నిరసనలు చోటుచేసుకున్నాయి. పర్వతాలపై 'నో కింగ్స్' అనే భారీ బోర్డును ప్రదర్శిస్తూ స్థానికులు నిరసన తెలిపారు. గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగానే ఈ నిరసనలు చెలరేగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.



## ప్రపంచంలోనే అతిపెద్ద అణు ప్లాంట్ పునఃప్రారంభం!

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఫుకుషిమాలో దాదాపు 15 ఏళ్ల క్రితం సంభవించిన అణు విపత్తు చేదు జ్ఞాపకాలను పక్కన పెట్టి, జపాన్ తన ఇంధన అవసరాల కోసం మళ్లీ అణుశక్తి వైపు అడుగులు వేస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన 'కాశివాజాకికారివా' ప్లాంట్‌లోని 6వ నంబర్ రియాక్టర్‌ను జపాన్ ప్రభుత్వం బుధవారం పునఃప్రారంభించింది. 2011 నాటి ఘోర విపత్తు తర్వాత టెప్కో సంస్థ తన రియాక్టర్‌ను ఆపరేట్ చేయడం ఇదే మొదటిసారి కావడంతో అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వాస్తవానికి ఈ రియాక్టర్‌ను మంగళవారమే ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ, పరీక్షల సమయంలో కంట్రోల్ రాడ్లకు సంబంధించిన సేఫ్టీ అలారం పనిచేయకపోవడంతో ప్రక్రియను ఒక రోజు వాయిదా వేశారు. బుధవారం సాయంత్రం కంట్రోల్ రాడ్లను వెనక్కి తీసుకోవడం ద్వారా రియాక్టర్‌ను విజయవంతంగా స్టార్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రియాక్టర్ ఫిబ్రవరి చివరి నాటికి వాణిజ్యపరంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనుంది.ప్రస్తుత ప్రధాన మంత్రి సనే తకైచి నేతృత్వంలోని ప్రభుత్వం ఇంధన భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లు, సెమీకండక్టర్ తయారీ పరిశ్రమల విస్తరణ వల్ల దేశంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. దీనికి తోడు 2050 నాటికి 'నెట్ జీరో' లక్ష్యాన్ని చేరుకోవడానికి అణుశక్తిని ఒక క్లీన్ ఎనర్జీగా ప్రభుత్వం భావిస్తోంది. విదేశీ శిలాజ ఇంధనాల దిగుమతుల పై భారాన్ని తగ్గించుకోవడానికి 2040 నాటికి దేశ విద్యుత్ అవసరాల్లో 20 శాతాన్ని అణుశక్తి ద్వారానే పొందాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది.అయితే, ఈ రియాక్టర్ పునఃప్రారంభంపై స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫుకుషిమా విపత్తు గాయాలు ఇంకా పచ్చిగానే ఉండటంతో, టెప్కో సంస్థ భద్రతా ప్రమాణాలపై ప్రజలు నమ్మకం ఉంచడం లేదు. దీనిని గమనించిన ప్రభుత్వం భద్రతా నిబంధనలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా కాశివాజాకి ప్లాంట్ వద్ద సునామీలను తట్టుకునేలా 15 మీటర్ల ఎత్తైన భారీ సముద్రపు గోడను నిర్మించారు. అయినప్పటికీ, ప్లాంట్ వెలుపల ఆందోళనకారులు నిరసనలు తెలుపుతూనే ఉన్నారు.ప్రస్తుతం జపాన్ వద్ద ఉన్న 33 రియాక్టర్లలో 15 రియాక్టర్లు తిరిగి పని చేయడం ప్రారంభించాయి. ఒకప్పుడు దేశ విద్యుత్ అవసరాల్లో 30 శాతం అణుశక్తి ద్వారానే తీరేవి. ఇప్పుడు మళ్లీ అదే స్థాయికి చేరుకోవాలని చూస్తున్న జపాన్ ప్రభుత్వానికి, భద్రత విషయంలో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం , పాత ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడటం ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది.



## ఆకట్టుకున్న మెక్రాన్ 'సన్‌గ్లాసెస్'

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ చేసిన ప్రసంగం దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో హాట్ టాపిక్‌గా మారింది. సామ్రాజ్యవాదం మళ్లీ పురుడుపోసుకుంటోందంటూ అమెరికాపై మెక్రాన్ చేసిన తీవ్ర విమర్శలు అంతర్జాతీయంగా చర్చకు దారితీశాయి. ఆయన వ్యాఖ్యలతో పాటు మరో విషయం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. అదే మెక్రాన్ ధరించిన సన్‌గ్లాసెస్.సదస్సు జరుగుతున్న హాల్‌లో కూడా కళ్లజోడు తీయకుండా మెక్రాన్ కనిపించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఇది ట్రంప్‌కు ఇచ్చిన సంకేతమా..? లేక స్టైల్ స్టేట్‌మెంట్‌నా..? అంటూ నెటిజన్లు వరుస పోస్టులు పెట్టారు. ఈ ఊహాగానాలకు మెక్రాన్ స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టారు. తనకు స్వల్ప కంటి సమస్య ఉందని, అందుకే సన్‌గ్లాసెస్ ధరించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఇటీవల కూడా ఆయన కన్ను ఎర్రగా వాచిన సందర్భంలో ఇలాగే కళ్లద్దాలు ధరించిన సంగతి తెలిసిందే.

## 'గాజా శాంతి మండలి'లో చేరిన ఇజ్రాయెల్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

గాజా పునర్నిర్మాణమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన 'శాంతి మండలి' అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. తొలుత ఈ కమిటీ కూర్పుపై పెదవి విరిచిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రస్తుతం యూటర్న్ తీసుకున్నారు. మనసు మార్చుకుని ఈ మండలిలో చేరేందుకు అధికారికంగా అంగీకరించారు. ట్రంప్ స్వయంగా ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ మండలిలో భాగస్వామ్యం కావాలని భారత్ సహా దాదాపు 60 దేశాలకు ట్రంప్ ఆహ్వానాలు పంపారు . ప్రపంచ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా ట్రంప్ ప్రతిపాదించిన ఈ 'శాంతి మండలి' ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. గాజాలో శాశ్వత శాంతి నెలకొల్పడం, యుద్ధంతో పూర్తిగా ధ్వంసమైన ప్రాంతాన్ని పునర్నిర్మించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం. తొలుత ఈ మండలి కూర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఇందులో భాగస్వామిగా ఉండటం అవసరమని భావిస్తోంది. మండలిలో టర్కీ, ఖతార్ వంటి దేశాలకు చోటు కల్పించడాన్ని నె



తన్యాహు కార్యాలయం మొదట తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి ఇజ్రాయెల్ భద్రతకు అనుకూలం కావని అభిప్రాయం వ్యక్తం చేసింది. అయితే ట్రంప్ వ్యక్తిగతంగా పంపిన ఆహ్వానాన్ని గౌరవిస్తూ , గాజా భవిష్యత్తును నిర్ణయించే కీలక వేదికకు దూరంగా ఉండటం సరికాదని నెతన్యాహు భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. గాజాలో స్థిరత్వం కోసం ట్రంప్ దాదాపు 60 దేశాలకు ఆహ్వానాలు పంపారు. ఇప్పటికే యూఏఈ, మొరాకో, వియత్నాం, హంగేరీ, అర్జెంటీనా వంటి దేశాలు సానుకూలంగా స్పందించాయి. భారత్‌కు కూడా ఈ ఆహ్వానం అందినట్లు కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. ఇందులో చేరాలా? వద్దా? అన్నదానిపై మోదీ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. భారత్ నిర్ణయంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. మరోవైపు రష్యా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ కూడా ఈ ప్రతిపాదనను అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ శాంతి మండలిలో చేరాలన్న ట్రంప్ ప్రతిపాదనను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తిరస్కరించడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ నుంచి దిగుమతి అయ్యే వైన్, షాంపైన్‌లపై 200 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. దీంతో ఐరోపా దేశాల్లో ఆందోళన మొదలైంది. గాజాలో ధ్వంసమైన మౌలిక వసతుల పునర్నిర్మాణం, ఆర్థిక పునరుజ్జీవనానికి గ్లోబల్ పెట్టుబడులు, హమాస్ నిరాయుధీకరణ, ప్రాంతీయ భద్రత పర్యవేక్షణ ఈ మండలి ప్రధాన లక్ష్యాలు. వీటిపై మరిన్ని వివరాలను దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ట్రంప్ వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పాక్ లో ఆర్థిక సంక్షోభం వేళ... నవాజ్ ఆడంబరాలా?

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ లో ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఆదేశ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుటుంబంలో జరిగిన విలాసవంతమైన వివాహ వేడుకలు పెను వివాదానికి దారి తీశాయి. దేశ ప్రజలు నిత్యావసరాలకే ఇబ్బంది పడుతున్న వేళ , కోట్ల రూపాయల ఆడంబరాలతో జరిగిన ఈ వివాహం సామాన్యుల ఆగ్రహాన్ని మరింత రెచ్చగొట్టింది. ఈ పెళ్లి వేడుకలో నవాజ్ షరీఫ్ కుమారుడు హసన్ నవాజ్ ధరించిన ఖరీదైన చేతి గడియారం ప్రస్తుతం పాకిస్తాన్ లో సోషల్ మీడియాలో పంచాయితీగా మారింది. జనవరి 17, 18 తేదీల్లో పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ కుమారుడు జునైద్ సఫ్దర్ వివాహం అత్యంత వైభవంగా జరిగింది. రాజకీయ నాయకుడు షేక్ రోహీల్ అస్గర్ మనవరాలు షాన్జే అలీ రోహీల్‌తో జరిగిన ఈ వివాహానికి దేశంలోని రాజకీయ, పారిశ్రామిక ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పెళ్లి జంట కంటే ఎక్కువగా అందరి దృష్టిని హసన్ నవాజ్



- షరీఫ్ కుటుంబంలో లగ్జరీ పెళ్లి
- 20 కోట్ల విలువైన వాచ్‌పై నెటిజన్ల ఫైర్

చేతికి ధరించిన లగ్జరీ వాచ్ ఆకర్షించింది ఆ వాచ్ 'ఫ్రాంక్ ముల్లర్ వన్‌గార్డ్ రివల్యూషన్ 3 స్కెలిటన్'గా నెటిజన్లు గుర్తించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు 6.85 లక్షల డాలర్లు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.6.26 కోట్లు. అదే పాకిస్తాన్ కరెన్సీలో చూస్తే దాదాపు 20 కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది. ఒక చేతి గడియారానికి ఇన్ని కోట్లా అంటూ పాక్ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పాకిస్తాన్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంతో పాటు , ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, విదేశీ అప్పులతో దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిన స్థితిలో ఉంది. ఇప్పటికే ఐఎంఎఫ్ నుంచి దాదాపు 9.8 బిలియన్ డాలర్ల అప్పుల్లో పాక్ మునిగిపోయింది. గోధుమ పిండి కోసం ప్రజలు క్యూలలో నిలబడి కొట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. పాలక వర్గాలు మాత్రం ఇలాంటి విలాసాల్లో మునిగి తేలడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాము కష్టపడి కట్టే పన్నులన్నీ రాజకీయ నాయకుల ఆడంబరాలకే ఖర్చవుతున్నాయంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ వాచ్‌తో పాటు పెళ్లికూతురు ధరించిన లగ్జరీ బ్రాండ్ హ్యాండ్‌బ్యాగ్ ధర కూడా లక్షల్లో ఉండటంతో విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. ఒకవైపు సామాన్యుడు పూట గడవడానికే అల్లాడుతుంటే.. మరోవైపు పాలక వర్గాల ఈ వైభోగ ప్రదర్శన పాకిస్తాన్‌లోని సామాజిక అసమానతలను మరోసారి బట్టబయలు చేస్తోంది.

## బుర్కినా ఫాసో మాజీ అధ్యక్షుడు అరెస్ట్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో మరోసారి రాజకీయ సెగలు రాజుకున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం త్రౌరేను హతమార్చేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు పాల్‌హెన్రీ సందాగో దమీబాను టోగో ప్రభుత్వం అరెస్ట్ చేసి, బుర్కినా ఫాసో అధికారులకు అప్పగించింది. 2022లో సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చిన దమీబా, కేవలం ఎనిమిది నెలల కాలంలోనే త్రౌరే చేతిలో పదవిని కోల్పోయి, అప్పటి నుండి పొరుగు దేశమైన టోగోలో ప్రవాస జీవితం గడుపుతున్నారు.ఈ హత్య కుట్రకు సంబంధించిన వివరాలను ఈ నెల ప్రారంభంలో బుర్కినా ఫాసో భద్రతా మంత్రి మహామడౌ సనా ప్రభుత్వ టెలివిజన్ ద్వారా వెల్లడించారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు, ముఖ్యంగా అధ్యక్షుడు ఇబ్రహీం త్రౌరేను హతమార్చ



డానికి జరిగిన భారీ కుట్రను భద్రతా దళాలు భగ్నం చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈ కుట్రకు దమీబా ప్రధాన సూత్రధారి అని, టోగోలో ఉంటూనే ఆయన ఒక 'మిలిటరీ వింగ్'ను నడిపిస్తున్నారని అధికారులు తీవ్రమైన ఆరోపణలు చేశారు.టోగో న్యాయశాఖ తెలిపిన వివరాల ప్రకారం, బుర్కినా ఫాసో ప్రభుత్వం చేసిన అధికారిక అభ్యర్థన మేరకు ఈ నెల 16న దమీబాను అరెస్ట్ చేశారు. అయితే, ఆయనను తిరిగి అప్పగించే క్రమంలో టోగో ప్రభుత్వం కొన్ని కఠినమైన షరతులను విధించింది. దమీబాపై ఉన్న దేశద్రోహ నేరాలకు మరణశిక్ష విధించబోమని బుర్కినా ఫాసో రాతపూర్వక హామీ ఇచ్చింది. అలాగే ఆయనకు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, ఆయన శారీరక క్షేమానికి , గౌరవానికి ఎలాంటి భంగం కలగకూడదని ఈ ఒప్పందంలో పేర్కొన్నారు.హత్య కుట్రతో పాటు దమీబా పలు ఆర్థిక నేరాలను కూడా ఎదుర్కొంటున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, అక్రమ ఆస్తుల సంపాదన, అవినీతి మరియు మనీ లాండరింగ్ వంటి ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. బుర్కినా ఫాసో గత కొన్నేళ్లుగా తీవ్రవాద హింస ,వరుస సైనిక తిరుగుబాట్లతో అతలాకుతలమవుతున్న నేపథ్యంలో, తాజా అరెస్ట్ దేశంలోని సైనిక , రాజకీయ వర్గాల్లో మరింత ఉద్రిక్తతలకు దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అమెరికా ఒత్తిడికి భారత్ పై ప్రభావముండదు

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా ఒత్తిడి భారత్‌ను ఏమాత్రం ప్రభావితం చేయలేదని, భారత విదేశాంగ విధానం పూర్తిగా ఆర్థిక వాస్తవాల ఆధారంగానే నడుస్తోందని భారత సంతతికి చెందిన అమెరికన్ సీఈఓ పరాగ్ ఖన్నా కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ఆధారిత జియోస్పేషియల్ అనలిటిక్స్ సంస్థ 'ఆల్ఫాజియో' వ్యవస్థాపక సీఈఓగా ఉన్న ఆయన, భారత్ తన సొంత ప్రజల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. రష్యా విషయంలో అమెరికా ఎంత ఒత్తిడి తెచ్చినా, భారత్ తన విధానాన్ని మార్చుకోలేదని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు దిగుమతులు చేస్తున్న భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నంలో గతేడాది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను 50 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని ఖన్నా గుర్తు చేశారు. ఆదర్శాల కంటే కఠినమైన ఆర్థిక అవసరాలే దేశాల విదేశాంగ విధానాలను నిర్ణయిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలు తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికే ప్రాధాన్యం




ఇస్తాయని తెలిపారు. ఈ విషయంలో భారత్ అగ్రస్థానంలో ఉందని ఖన్నా అభిప్రాయపడ్డారు. ''దేశాలను వాటి వాణిజ్య లోటు, దిగుమతుల వాటా ఆధారంగా ర్యాంక్ చేయవచ్చు. ఆ వాటా ఎక్కువగా ఉన్న దేశాలు ఆదర్శాల కంటే ఆర్థిక ప్రయోజనాలనే ముందుంచుతాయి. ఇది చౌకగా దిగుమతులు చేసుకోవాలా..? లేక దేశీయంగా భారీ సబ్సిడీలు భరించాలా..? అనే ప్రశ్నగా మారుతుంది'' అని ఆయన వివరించారు. భారత్ మాత్రమే కాదు, అమెరికాకు సన్నిహిత మిత్ర దేశమైన జపాన్ కూడా రష్యా ఇంధనాన్ని దిగుమతి చేసుకునేందుకు మార్గాలను అన్వేషించిందని ఖన్నా గుర్తు చేశారు. నార్డ్ స్ట్రీమ్ పైపులైన్ పేల్చివేత కూడా యూరప్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రష్యా చమురు, గ్యాస్‌ను పొందుతోందని తెలిపారు. ప్రపంచమంతా ఇప్పుడు 'మల్టీఅలైన్‌మెంట్' విధానాన్ని అనుసరిస్తోందని అన్నారు. భారత్ తన పొరుగు దేశాలపై దృష్టి పెట్టి, ఇతర దేశాల ఆదేశాలను పాటించకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తోందని ఖన్నా ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా ఆంక్షలు విధించినా, భారత్ తన జాతీయ ప్రయోజనాలే ప్రధానంగా ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

## రక్షణ మంత్రి పరువు తీసిన పిజ్జా హట్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా పరువు పోగొట్టుకున్నారు. తాజాగా ఆయన సియాల్‌కోట్‌లో ప్రారంభించిన పిజ్జా హట్ అవుట్‌లెట్ తమది కాదని, అది పూర్తిగా నకిలీదని పిజ్జా హట్ పాకిస్తాన్ సంస్థ ప్రకటించడంతో మంత్రి నవ్వులపాలయ్యారు. అధికారిక స్టోర్ల జాబితాలోనే లేని ఒక ఫేక్ అవుట్‌లెట్‌ను ప్రారంభించడమే కాకుండా, దానికి రిబ్బన్ కత్తిరించడంతో నెటిజనులు పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. మంత్రి పాల్గొన్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయ్యాయి. అంతా సవ్యంగా జరిగిందని భావించిన లోపే అసలు ట్విస్ట్ మొదలైంది. ఈ విషయం కాస్తా పిజ్జా హట్ పాకిస్తాన్ యాజమాన్యం దృష్టికి చేరింది. వెంటనే సంస్థ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సియాల్‌కోట్ కంటోన్‌మెంట్‌లో ప్రారంభించిన పిజ్జా హట్ అవుట్‌లెట్ తమది కాదని, పూర్తిగా అనధికారికంగా తమ పేరును, లోగోను, బ్రాండింగ్‌ను అక్రమంగా వాడుకుంటున్నారని పేర్కొంది. దీంతో పాకిస్తాన్ రక్షణ మంత్రి పరువు సింధు నదిలో కలిసినట్టయ్యింది. "మా



విలువైన కస్టమర్లకు తెలియజేస్తున్నాం. సియాల్‌కోట్ కంటోన్‌మెంట్‌లో ఇటీవల ప్రారంభించిన పిజ్జా హట్ అవుట్‌లెట్ పిజ్జా హట్ పాకిస్తాన్‌కు చెందింది కాదు. ఇది మా బ్రాండ్ పేరు, గుర్తింపును తప్పుగా వినియోగిస్తోంది. పిజ్జా ప్రేమికులు ఈ విషయాన్ని గమనించగలరు" అని సంస్థ తన ప్రకటనలో పేర్కొంది. ఆ అవుట్‌లెట్‌కు పిజ్జా హట్ పాకిస్తాన్‌తో గానీ, దాని మాతృ సంస్థ యమ్! బ్రాండ్స్ తో గానీ ఎలాంటి చట్టపరమైన లేదా కార్యకలాప సంబంధం లేదని స్పష్టం చేసింది. ఆ నకిలీ అవుట్‌లెట్ పిజ్జా హట్ అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలు, ఆహార భద్రతా నియమాలు పాటించదని కూడా సంస్థ హెచ్చరించింది. తమ ట్రేడ్‌మార్క్‌ను దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించింది. ఈ ప్రకటనతో ఖవాజా ఆసిఫ్ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది.ఆ అవుట్‌లెట్ పిజ్జా హట్‌కు చెందిన ఎర్రటి పైకప్పు లోగో, బ్రాండింగ్‌తో అచ్చం అధికారిక ఫ్రాంచైజీలా కనిపించింది. నెటిజనులు వెంటనే పిజ్జా హట్ పాకిస్తాన్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న స్టోర్ల జాబితాలో సియాల్‌కోట్ పేరు లేకపోవడంతో అసలు విషయం బయటపడింది. కంపెనీ వివరాల ప్రకారం ప్రస్తుతం పాకిస్తాన్‌లో మొత్తం 16 అధికారిక పిజ్జా హట్ స్టోర్లు మాత్రమే ఉన్నాయి. వీటిలో 14 లాహోర్‌లో, రెండు ఇస్లామాబాద్‌లో ఉన్నాయి. దీంతో సోషల్ మీడియాలో ఖవాజా ఆసిఫ్‌ను నెటిజనులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. "రక్షణ మంత్రి హోదాలో ఉండి నకిలీదేదో , అసలేదేమిటో కూడా తెలుసుకోలేరా?", "ఇంత దారుణమా పరిస్థితి?" అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. ఒక ఫేక్ పిజ్జా హట్ ప్రారంభోత్సవం పాక్ రక్షణ మంత్రికి పెద్ద పరువు నష్టం తెచ్చిపెట్టింది.



## దావోస్ లో ట్రూడో, కేటీ పెర్రీల హల్ చల్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

దావోస్ సదస్సులో కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రముఖ అమెరికన్ పాప్ సింగర్ కేటీ పెర్రీ ప్రేమ జంట మరోసారి కెమెరాకు చిక్కింది. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు 2026 లో ఈ జంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న వీరిద్దరి మధ్య కెమిస్ట్రీని చాటే రొమాంటిక్ మూమెంట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సదస్సులో భాగంగా నిర్వహించిన 'గ్లోబల్ సాఫ్ట్ పవర్ సమ్మిట్'లో జస్టిన్ ట్రూడో ప్రసంగిస్తుండగా.. కేటీ పెర్రీ అనూహ్యంగా 'ఫీమేల్ కోషెంట్ లాంజ్'లోకి ప్రవేశించి ఆయనకు మద్దతుగా నిలిచారు. వేదికపై నుంచి కేటీని గమనించిన ట్రూడో చిరునవ్వుతో కన్నుగీటగా , ఆమె కూడా నవ్వుతూ ప్రతిస్పందించారు. ఈ దృశ్యం అక్కడున్న కెమెరాల్లో నిక్షిప్తమైంది. ప్రపంచ నేతలు, పారిశ్రామికవేత్తలు హాజరైన అంతర్జాతీయ వేదికపై చోటుచేసుకున్న ఈ రొమాంటిక్ క్షణం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న ఈ జంట, దావోస్ వేదికగా మరోసారి వార్తల్లో నిలిచారు.




## యూఎస్ పై ఆధారపడొద్దు - కెనడా ప్రధాని

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచంలో మరి కొన్ని దేశాలపై నమ్మకం పెట్టుకోలేని పరిస్థితి వచ్చిందని కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్పష్టం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలపై పరోక్షంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. అమెరికా ఆధిపత్యంలో ప్రపంచం పరివర్తన దిశగా కాకుండా విచ్ఛిన్నం వైపు సాగుతోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు భాగస్వామ్య శ్రేయస్సు కోసం కుదుర్చుకున్న ఆర్థిక ఒప్పందాలను ఇప్పుడు పైస్థానంలో ఉన్న దేశాలు ఆయుధాలుగా మార్చుకుంటున్నాయని అన్నారు. బలవంతులు తమ ప్రయోజనాలకే అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ అసమానమైన వాణిజ్య నియమాలను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకాలం భౌగోళిక పరిస్థితులు, ప్రపంచ దేశాలతో ఉన్న పొత్తులే భద్రతకు, శ్రేయస్సుకు హామీ ఇస్తాయని నమ్మామని.. ఆ నమ్మకాలు ఇక తిరిగి రావని కార్నీ వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు పరస్పరం ఆధారపడటం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో ఇటీవల ఎదురైన ఆర్థిక, ఇంధన, భౌగోళిక రాజకీయ సంక్షోభాలే ఉదాహరణలని తెలిపారు. ముఖ్యంగా కొన్ని ప్రధాన శక్తులు సుంకాలు, ఆర్థిక వ్యవస్థలు, వాణిజ్య సరఫరా గొలుసులను ఆయుధాలుగా మార్చుకుని ఇతర దేశాలపై ఒత్తిడి తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల వల్ల కెనడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెప్పారు. అందుకే ఇకపై ఇతర దేశాలపై ఆధారపడకుండా దేశీయ సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు బలహీనపడుతున్నాయని.. ఈ పరిస్థితుల్లో దేశాలు మరింత స్వతంత్రంగా వ్యవహరించాల్సి వస్తోందని అన్నారు. ఒకే ఆలోచన కలిగిన దేశాలు భాగస్వాములుగా మారి, సౌకర్యవంతమైన సంకీర్ణాలను నిర్మించుకోవాలని కార్నీ పిలుపునిచ్చారు.



## బంగ్లా నుంచి స్వదేశానికి రండి

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

బంగ్లాదేశ్‌లో పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భద్రతా పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అక్కడ పనిచేస్తున్న దౌత్య అధికారులు, ఇతర సిబ్బంది కుటుంబ సభ్యులను ముందస్తు జాగ్రత్త చర్యగా స్వదేశానికి తిరిగి రావాలని భారత్ సూచించింది. ఎన్నికలకు ముందు నిరసనలు, అసహకార ఉద్యమాలు పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.భారత ప్రభుత్వ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. "భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారుల కుటుంబ సభ్యులు తాత్కాలికంగా స్వదేశానికి రావాలని సూచించాం" అని పేర్కొన్నారు. అయితే ఢాకాలోని భారత హైకమిషన్‌తో పాటు ఖుల్నా, రాజ్‌షాహి, సిల్హెట్‌లలోని ఇతర దౌత్య కార్యాలయాలు సాధారణంగానే కార్యకలాపాలు కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. భద్రత అత్యంత సంక్లిష్టంగా మారిన సందర్భాల్లో మాత్రమే 'నాన్-ఫ్యామిలీ' విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు.షేక్ హసీనా ప్రభుత్వం పతనం తర్వాత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వంతో భారత-బంగ్లాదేశ్ సంబంధాలు కొంత ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
22.01.2026
www.manasarkar.com



## తిరుమలలో 'రథసప్తమి'కి సర్వం సిద్ధం

**తిరుమల (ఏడీఎన్ఎన్) :**

సూర్యజయంతిని పురస్కరించుకుని ఈ నెల 25న తిరుమలలో నిర్వహించే 'రథసప్తమి' ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సన్నద్ధమైంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, అన్నప్రసాదం, లడ్డూల పంపిణీ, రద్దీ నియంత్రణపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ రథసప్తమి పర్వదినం సందర్భంగా సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు శ్రీవారి మాడ వీధుల్లో మలయప్ప స్వామి ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. షెడ్యూల్ ప్రకారం తెల్లవారుజామున 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో మొదలై, వరుసగా చిన్నశేష, గరుడ, హనుమంత వాహన సేవలు జరుగుతాయి. మధ్యాహ్నం 2 గంటలకు చక్రస్నానం నిర్వహించిన తర్వాత , సాయంత్రం కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామివారు ఊరేగుతారు. చివరగా రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆ రోజున పలు సేవలను టీటీడీ రద్దు చేసింది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ వంటి ఆర్జిత సేవలతో పాటు ఎన్ఆర్ఐలు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఇచ్చే ప్రత్యేక ప్రివిలేజ్ దర్శనాలను కూడా నిలిపివేసింది. జనవరి 24 నుంచి 26 వరకు తిరుపతిలో స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా మిగిలిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు, ఇందుకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉండే భక్తుల సౌకర్యార్థం టీటీడీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. గ్యాలరీల్లోనే భక్తులకు నిరంతరం అన్నప్రసాదం, పాలు, తాగునీరు పంపిణీ చేయనున్నారు.



## అధైర్యపడకండి.. పార్టీ అండగా ఉంటుంది!

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

పల్నాడు జిల్లాలో రాజకీయ కక్షపూరిత దాడులకు గురైన బాధితులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భరోసానిచ్చారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పిన్నెల్లి గ్రామానికి చెందిన దళిత కార్యకర్త మంద సాల్మన్ కుటుంబ సభ్యులు, అలాగే దాడిలో గాయపడిన చల్లా నాగరాజు జగన్ మోహన్ రెడ్డి ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బాధితుల ఆవేదనను విన్న జగన్, పార్టీ వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. టీడీపీ శ్రేణుల చేతిలో దారుణంగా హత్యకు గురైన మంద సాల్మన్ కుమారులు మరియదాసు, భిక్షం , కుమార్తె రాహేలు తమ తండ్రిని కోల్పోయిన తీరును జగన్ వద్ద వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. రాజకీయ కక్షతో తమ తండ్రిని కిరాతకంగా చంపేశారని, ఇప్పుడు తమ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఓదార్చిన జగన్, "ఎవరూ అధైర్యపడొద్దు.. మీ నాన్న చేసిన త్యాగం వృథా పోదు. పార్టీ మీకు అన్ని వేళలా అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను, పోలీసుల నుంచి ఎదురవుతున్న వేధింపులను పిన్నెల్లి గ్రామస్తులు జగన్ దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ కేసులు పెడతామని పోలీసులు తమను బెదిరిస్తున్నారని వాపోయారు. దీనిపై జగన్ స్పందిస్తూ.. ప్రభుత్వ అండతో పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం అత్యంత దారుణమని మండిపడ్డారు. పార్టీ లీగల్ సెల్ ద్వారా బాధితులకు పూర్తిస్థాయిలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు.



## ఏపీలో మళ్లీ భూముల ధరల పెంపు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణ ప్రాంత భూముల మార్కెట్ విలువలను పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సవరించిన ఈ కొత్త ధరలు ఫిబ్రవరి 1, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ బుధవారం అధికారిక మెమో జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువల పెంపు ఇది రెండోసారి కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు , రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ. 13,150 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భూముల వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సగటున 7 నుంచి 8 శాతం వరకు విలువలు పెరిగే అవకాశం ఉండగా, కొత్త జిల్లా కేంద్రాలు , అత్యంత డిమాండ్ ఉన్న వాణిజ్య ప్రాంతాల్లో ఈ పెంపు 15 శాతం వరకు ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంపు డ్యూటీల రూపంలో కొనుగోలుదారులపై భారం పెరగనుంది. దీంతో ధరలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని కొనుగోలుదారులు ప్రయత్నిస్తుండగా, మరోవైపు పెరిగిన ధరల వల్ల తమ ఆస్తుల విలువ పెరుగుతుందని భావించే యజమానులు అమ్మకాలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నారు. ఈ పరిస్థితి రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెను మార్పులకు దారితీసే అవకాశం ఉంది. అమరావతి రాజధాని ప్రాంతంలో పెట్టుబడులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రస్తుతానికి అక్కడ విలువల పెంపు నుంచి మినహాయింపు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. మార్కెట్ విలువల సవరణ వ్యవస్థను మరింత పారదర్శకం చేసేందుకు మరో రెండు నెలల్లో దీన్ని పునర్వ్యవస్థీకరించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మొత్తం మీద ఫిబ్రవరి 1 నుండి భూముల కొనుగోలుదారులు తమ జేబులకు చిల్లు పడకముందే జాగ్రత్త పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## అసెంబ్లీకి రండి.. దేనిపైనైనా చర్చిద్దాం

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన, కూటమి ప్రభుత్వం చేపట్టిన 19 నెలల అభివృద్ధిపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధమని రాష్ట్ర మంత్రి సవిత సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు కేవలం బయట ఆరోపణలు చేయడం మానేసి, ధైర్యముంటే అసెంబ్లీకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. పులివెందుల అభివృద్ధి నుంచి రాష్ట్రవ్యాప్త సంక్షేమం వరకు ఏ అంశం పైనైనా చర్చించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. అసెంబ్లీకి వస్తే జగన్ మోహన్ రెడ్డి కు మైక్ ఇవ్వరనే ప్రచారాన్ని మంత్రి కొట్టిపారేశారు. "జగన్ , ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభకు వస్తే, నిబంధనల ప్రకారం కచ్చితంగా మైక్ ఇస్తాం. వారు ఏ అంశంపైనైనా మాట్లాడవచ్చు. కానీ, సభకు రాకుండా తప్పించుకుంటూ బయట అసత్యాలు ప్రచారం చేయడం సరికాదు," అని ఆమె హితవు పలికారు. అలాగే, వైసీపీ నాయకులు 'రప్పా.. రప్పా..' అంటూ అధికారులను, పోలీసులను బెదిరిస్తున్నారని, అయితే వారి బెదిరింపులను రాష్ట్రంలో ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో జగన్ తన ప్రచార యావ కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. "కుల ధ్రువీకరణ పత్రాలు, సర్వే రాళ్లు, స్కూల్ బ్యాగ్‌ల నుంచి పట్టాదారు పాస్ బుక్కుల వరకు ప్రతి దానిపై తన ఫొటో వేయించుకున్న ఘనత జగన్‌ది. ముఖ్యంగా పాస్ బుక్కులపై జగన్ బొమ్మ చూసి రైతులు తమ భూములపై హక్కులు కోల్పోతామేమోనని తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించారు" అని ఆమె ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా బయట పడుతోందని, త్వరలోనే మరికొందరు 'గజదొంగల' వివరాలను వెల్లడిస్తామని మంత్రి హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పారదర్శకతతో ముందుకు వెళ్తోందని, గత ప్రభుత్వ తప్పిదాలను ఎండగడతామని ఆమె పునరుద్ఘాటించారు.

## న్యాయపోరాటం ఆపే ప్రసక్తే లేదు

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత కార్యకర్త మంద సాల్మన్ హత్యపై న్యాయపోరాటం ఆపే ప్రసక్తే లేదని ఆ పార్టీ నేత, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లిలో సాల్మన్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఆయన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సాల్మన్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని జగన్ భరోసా ఇచ్చారు. తర్వాత మీడియాతో మాట్లాడిన కాసు మహేష్ రెడ్డి, కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పోలీసు వ్యవస్థ టీడీపీ నాయకుల అరాచకాలకు వంత పాడుతోందని కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. "పిన్నెల్లి గ్రామంలో టీడీపీ నేతల దాడులకు భయపడి 300 కుటుంబాలకు చెందిన సుమారు వెయ్యి మంది గ్రామాన్ని విడిచి వలస వెళ్లారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడటానికి వచ్చిన సాల్మన్‌ను ఇనుప రాడ్లతో కొట్టి చంపడం అత్యంత దారుణం. కనీసం ఆయన అంత్యక్రియలు కూడా గ్రామంలో జరగకుండా అడ్డుకోవాలని చూడటం అమానుషం," అని ఆయన మండిపడ్డారు. సాల్మన్ కుటుంబానికి న్యాయం చేకూర్చేందుకు న్యాయస్థానాలతో పాటు జాతీయ మానవ హక్కుల సంఘం,జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని కాసు మహేష్ రెడ్డి వెల్లడించారు. వచ్చే ఆదివారం పిన్నెల్లి గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో సాల్మన్ సంస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, దానికి రాష్ట్రస్థాయి నేతలు హాజరవుతారని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. "మా గ్రామంలో మంద సాల్మన్ హత్యే



చివరిది కావాలి. పగలు, ప్రతీకారాలతో కుటుంబాలను నాశనం చేసే సంస్కృతికి ఇకనైనా ముగింపు పలకాలి," అని సాల్మన్ తమ్ముడు అన్నోజిరావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో శాంతి నెలకొనేలా పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపాలని, తన అన్న హంతకులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆయన వేడుకున్నారు. కక్షలు లేని ప్రశాంత వాతావరణమే తమ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు.

## పుట్టెడు దుఃఖంలోనూ ప్రాణదానం

- ఐదుగురికి పునర్జన్మ నిచ్చిన జనసేన కార్యకర్త..
- త్యాగం స్ఫూర్తిదాయకమని కితాబిచ్చిన పవన్ కళ్యాణ్

**మచిలీపట్నం (ఏడీఎన్ఎన్) :**



కష్టకాలంలోనూ మానవత్వాన్ని చాటుకుని ఐదుగురి ప్రాణాలు కాపాడిన ఒక సామాన్య కార్యకర్త కుటుంబాన్ని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పెదచందాలకు చెందిన జనసేన కార్యకర్త చందు వీరవెంకట వసంతరాయలు గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయ్యారు. ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు గుండె నిబ్బరంతో తీసుకున్న అవయవదాన నిర్ణయం ఐదుగురు వ్యక్తులకు పునర్జన్మ నిచ్చింది. ఆ రోజే ఆ కుటుంబాన్ని కలుస్తానని హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్, తాజాగా పెదచందాల గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి చేరుకున్న పవన్ కల్యాణ్, వసంతరాయలు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ, మరో ఐదుగురి ప్రాణాలు నిలపాలనే గొప్ప ఆలోచన చేసిన వసంతరాయలు కుటుంబాన్ని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ త్యాగం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ పరామర్శ సమయంలో కుటుంబ సభ్యులు తమకు ఎదురవుతున్న కొన్ని వ్యక్తిగత మరియు గ్రామీణ సమస్యలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నింటినీ ఓపికగా విన్న ఉప ముఖ్యమంత్రి, ఆ కుటుంబానికి తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల క్షేమమే పార్టీకి ప్రాధాన్యమని, వసంతరాయలు వంటి నిబద్ధత గల కార్యకర్త కుటుంబానికి ఏ లోటు రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఒక సాధారణ కార్యకర్త ఇంటికి స్వయంగా ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ రావడం స్థానిక జనసేన శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. అధికారం వచ్చినా పాత హామీని మర్చిపోకుండా బాధితులను పరామర్శించిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పవన్ పర్యటన నేపథ్యంలో గ్రామంలో భారీగా భద్రత ఏర్పాటు చేయడంతో పాటు జనసైనికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## కొండవీడు ఉత్సవాలకు ముస్తాబు

**ఫిబ్రవరి 7, 8 తేదీల్లో గ్రాండ్ ఫెస్ట్!**

**నరసరావుపేట (ఏడీఎన్ఎన్) :**



పల్నాడు జిల్లా చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించే 'కొండవీడు ఉత్సవాల'ను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే ఈ వేడుకలకు సంబంధించి బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలపై ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొండవీడు కోట విశిష్టతను చాటిచెప్పేలా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ప్రత్యేక ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు కొండవీడు చరిత్ర పై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో చారిత్రక స్పృహను పెంచాలని సూచించారు. ఉత్సవాల షెడ్యూల్‌ను తక్షణమే రూపొందించి ప్రచారాన్ని వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఫెస్ట్‌ను నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోరారు . కోటకు చేరే రహదారులకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యాటకుల రద్దీకి తగినట్లుగా త్రాగునీరు, టాయిలెట్లు, ఫుడ్ కోర్టులు మరియు వివిధ స్టాళ్లను సిద్ధం చేయాలన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా ఆహ్లాదకరమైన సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలని ఈవెంట్ మేనేజర్‌కు సూచించారు. ఈ ఉత్సవాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ, దానికి నోడల్ అధికారిగా జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణప్రియను కలెక్టర్ నియమించారు. కమిటీ సభ్యులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత ,ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మందుబాబు 'మహా' విన్నపం

- విగ్రహం వద్ద పాట పాడుతూ వినూత్న నిరసన..
- మద్యం ధరలు తగ్గించాలంటూ ఎర్రం నాయుడు విగ్రహానికి మొర..

**టెక్కలి (ఏడీఎన్ఎన్) :**



మద్యం మత్తులో ఉన్నప్పుడు మనుషులు చేసే పనులు ఒక్కోసారి విస్మయానికి గురిచేస్తే, మరికొన్ని సార్లు కడుపుబ్బ నవ్విస్తాయి. తాజాగా శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఒక మందుబాబు చేసిన పని ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మద్యం ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్న ఆవేదనతో.. సదరు వ్యక్తి నేరుగా దివంగత నేత ఎర్రం నాయుడు విగ్రహం వద్దకు వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నాడు.టెక్కలికి చెందిన ఒక వ్యక్తి ఫుల్లుగా మద్యం సేవించి, మత్తులో ఊగుతూ మంత్రి అచ్చెన్నాయుడు సోదరుడు, మాజీ కేంద్ర మంత్రి ఎర్రం నాయుడు విగ్రహం వద్దకు చేరుకున్నాడు. విగ్రహం ముందు నిలబడి, వినయంగా నమస్కరిస్తూ.. "మద్యం ధరలు తగ్గించయ్యా..," అంటూ పాట రూపంలో తన విన్నపాన్ని వినిపించాడు. తన కష్టాలను, పెరిగిన ధరలను రాగయుక్తంగా పాడుతూ విగ్రహానికి మొర పెట్టుకోవడం అక్కడ ఉన్నవారిని ఆశ్చర్యపరిచింది.ఈ గమ్మత్తైన దృశ్యాన్ని అక్కడే ఉన్న కొందరు స్థానికులు తమ సెల్‌ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇంకేముంది.. ఈ వీడియో కాస్తా క్షణాల్లో వైరల్‌గా మారింది. "మందుబాబా మజాకా!" అంటూ నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు. "సోయి లేకపోయినా.. విగ్రహానికి విన్నవించుకోవాలనే ఆలోచన భలే ఉందే" అని కొందరు నవ్వుకుంటుంటే, మరికొందరు, "ధరల భారం మందుబాబులను ఏ స్థాయికి తీసుకెళ్లిందో చూడండి" అంటూ సెటైర్లు వేస్తున్నారు.ఒకప్పుడు ఇలాంటి తిక్క పనులు చేసినప్పుడు కేవలం చుట్టుపక్కల వారు మాత్రమే చూసి నవ్వుకునేవారు. కానీ, ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యమా అని ఈ మందుబాబు 'డిమాండ్' ప్రపంచమంతటా మారుమోగిపోతోంది. మొత్తానికి టెక్కలి మందుబాబు విన్నపం ఇప్పుడు ఏపీ రాజకీయ వర్గాల్లోనూ సరదా చర్చకు దారితీసింది.



## అసెంబ్లీకి రాకపోతే జీతాలు కట్..

**'నో వర్క్ - నో పే' నిబంధన తేవాలి**

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

శాసనసభకు హాజరు కాకుండానే జీతభత్యాలు తీసుకుంటున్న కొందరు ఎమ్మెల్యేల తీరుపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం' అనే అంశంపై ప్రసంగిస్తూ, సభకు రాకుండా, ఒక్క చర్చలోనూ పాల్గొనకుండా ప్రజాధనాన్ని జీతాల రూపంలో తీసుకోవడం అత్యంత అనైతికమని ఆయన మండిపడ్డారు. సభ్యుల బాధ్యతారాహిత్యంపై వేదన వ్యక్తం చేస్తూ, కొందరు ఎమ్మెల్యేలు ఒక్క రోజు కూడా సభకు రాకపోయినా నెలవారీ జీతాలు మాత్రం క్రమం తప్పకుండా తీసుకుంటున్నారని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఇలాంటి ప్రవర్తన వల్ల ప్రజాప్రతినిధులు ప్రజల దృష్టిలో చులకన అవుతున్నారని, ఇది శాసనసభ వ్యవస్థకే గౌరవం కాదని ఆవేదన చెందారు. ప్రస్తుతం ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిరోధించే సరైన నిబంధనలు లేకపోవడాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగా స్పీకర్ రెండు కీలక ప్రతిపాదనలు చేశారు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్‌నో పే' నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అంటే, పని చేయని వారికి జీతం చెల్లించకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా, ప్రజల పట్ల జవాబుదారీగా ఉండని ఎమ్మెల్యేలను వెనక్కి పిలిచే 'రీకాల్' హక్కును ఓటర్లకే కల్పించాలని, అప్పుడే ప్రజాప్రతినిధుల్లో బాధ్యత పెరుగుతుందని ఆయన ప్రతిపాదించారు. ప్రజలు తమ సమస్యలు సభలో వినిపిస్తారనే నమ్మకంతో ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయడం సరికాదని అయ్యన్నపాత్రుడు హితవు పలికారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థకు నిజమైన గౌరవం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. స్పీకర్ చేసిన ఈ సంచలన ప్రతిపాదనలు ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి.



## జగన్ మరో పాదయాత్ర చేస్తే రాష్ట్రం తట్టుకోలేదు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ పాదయాత్ర చేస్తానంటూ చేసిన ప్రకటనపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో జగన్ చేసిన ఒక్క పాదయాత్రతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంచనాకు అందని నష్టం జరిగిందని, ఇప్పుడు మరో యాత్ర చేస్తే రాష్ట్రం ఇంకెంత నష్టపోతుందో ప్రజలు ఊహించలేరని ఆయన ఎద్దేవా చేశారు. మీడియాతో బుధవారం మాట్లాడిన మంత్రి, వైఎస్ జగన్ అవగాహన రాహిత్యంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని విద్యా, వైద్య రంగాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న పీపీపీ విధానంపై వైఎస్ జగన్ చేస్తున్న విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. "ప్రైవేటైజేషన్ కు, పీపీపీకి తేడా తెలియని వ్యక్తి జగన్. ఇలాంటి వ్యక్తి మళ్ళీ అధికారంలోకి వస్తే ఏకంగా సీఎం కుర్చీని కూడా ప్రైవేటీకరించేస్తారేమోనని ఆందోళనగా ఉంది," అని మంత్రి వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాక్ విభాగానికి పీపీపీ విధానాన్ని అమలు చేశారని, అది ఆయనకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. పీపీపీ విధానం వల్ల ప్రభుత్వ ఆస్తులు ప్రజలకే ఉంటాయని, కేవలం నిర్వహణలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల ప్రజలకు మేలైన సేవలు అందుతాయని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్న జగన్, తన సొంత కార్యకర్తల అరాచకాలను ఎందుకు ఆపడం లేదని మంత్రి పార్థసారథి నిలదీశారు. వైసీపీ కార్యకర్తలు 'రప్పా.. రప్పా..' అని నరుకుతామంటూ నినదిస్తున్నా మాజీ సీఎం వారిని కనీసం వారించడం లేదని, దీన్నిబట్టి ఆయన గంజాయి బ్యాచ్‌కు బాసటగా నిలుస్తున్నారని ప్రజలు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. సొంత కారు కింద పడి కార్యకర్త చనిపోయినా కనీసం పట్టించుకోని నైజం జగన్ మోహన్ రెడ్డి దని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో జగన్‌కు దళితులు గుర్తుకు రాలేదని, అధికారం పోగానే ఇప్పుడు దళితులపై ప్రేమ ఒలకబోస్తున్నారని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పోలీసులు పూర్తి స్వేచ్ఛతో పనిచేస్తున్నారని, చట్టం తన పని తాను చేసుకుపోతోందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా వెనక్కి తగ్గదని, తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.



## బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**నాయుడుపేట (ఏడీఎన్ఎన్) :**

నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పూతలపట్టునాయుడుపేట జాతీయ రహదారిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఒక స్కూటర్‌ను బలంగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటకు చెందిన షాహుద్దీన్ (40) బుధవారం తన స్కూటర్‌పై నాయుడుపేట నుండి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో బెంగళూరు నుండి నెల్లూరు వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు, పెళ్లకూరు మండలం వద్ద జాతీయ రహదారిపై ఆయన ప్రయాణిస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో షాహుద్దీన్ తలకు బలమైన గాయం కావడంతో భారీగా రక్తస్రావమైంది. పరిస్థితి విషమించడంతో ఆయన ఘటనా స్థలంలోనే కన్నుమూశారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజల జీవితాల్లో మార్పే
# నిజమైన అభివృద్ధి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):

తెలంగాణ రాష్ట్రంలో కేవలం భవనాల నిర్మాణమే అభివృద్ధి కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన ప్రగతని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో సుమారు 230 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 200 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల' భవనానికి, అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాటర్ ప్లాంట్, ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పేద బిడ్డలకు నాణ్యమైన విద్యనందిస్తే వారు సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 200 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలల ద్వారా ఒకే ప్రాంగణంలో విద్య, క్రీడలు, ల్యాబ్స్, హాస్టల్ వంటి అత్యాధునిక వసతులను కల్పిస్తున్నామని భట్టి వివరించారు. వెనుకబడిన వర్గాల వారు చదువులో, ఉద్యోగాల్లో రాణించి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



## నీటిపారుదల ప్రాజెక్టులపై
# మంత్రి ఉత్తమ్ సమీక్ష

### తుమ్మిడిహెట్టి డీపీఆర్ పనులు వేగవంతం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సెక్రెటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తుమ్మిడిహెట్టి బ్యారేజీకి సంబంధించిన డీపీఆర్ తయారీ కోసం సర్వేలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. బ్యారేజీ నిర్మాణ ప్రాంతంలో 73 చదరపు కిలోమీటర్ల మేర టోపోగ్రాఫికల్ సర్వేతో పాటు, 85 కిలోమీటర్ల మేర కాలువ సర్వే కూడా పూర్తయిందని తెలిపారు. రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను వేగవంతం చేసేందుకు నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. టన్నెల్‌లో గతంలో చిక్కుకుపోయిన టీబీఎం యంత్రం శకలాలను ఇప్పటికే పూర్తిగా తొలగించామని, ప్రస్తుతం మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై పుణెకు చెందిన సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థ అధ్యయనం చేసి నివేదికను సమర్పించిందని, ఈ నివేదిక ఆధారంగా మూడు బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను నెల వ్యవధిలోగా సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీల క్షేత్రస్థాయి పరిశీలన జనవరి 22న ప్రారంభం కానుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం 112 టీఎంసీల నుంచి 90 టీఎంసీలకు పడిపోవడంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టిందని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా చూసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని మంత్రి పునరుద్ఘాటించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూనే నిర్ణీత గడువులోగా ఈ ప్రాజెక్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన లక్ష్యంగా నిర్దేశించారు.

## యూరియా అందించలేని
# చేతకాని ప్రభుత్వం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):



రాష్ట్రంలో అన్నదాతల అవస్థలు వర్ణనాతీతంగా మారాయని, సాగుకు అత్యంత కీలకమైన యూరియాను కూడా సకాలంలో సరఫరా చేయలేకపోవడం ప్రస్తుత ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ట అని మాజీ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. ముఖ్యంగా నాగర్ కర్నూల్ జిల్లా ముష్టిపల్లి వంటి ప్రాంతాల్లో రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తుంటే, రైతు వేదికలకు తాళాలు వేసి అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం అత్యంత దురదృష్టకరమని ఆమె మండిపడ్డారు. యాసంగి సీజన్‌లో చెమటోడ్చి పని చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి, వారిని రోడ్లెక్కి నిరసనలు తెలిపేలా చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని, తక్షణమే ఎరువుల కొరతను తీర్చకపోతే ప్రజాగ్రహం తప్పదని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం 'తెలంగాణ జాగృతి' ద్వారా జనం బాట పట్టిన కవిత, అటు క్షేత్రస్థాయి సమస్యలపై పోరాడుతూనే, ఇటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాజకీయంగా తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు.

## ఉద్యోగుల పెండింగ్ డీఏలపై
# మంత్రి కోమటిరెడ్డి భరోసా

### సీఎంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ!

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):



ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల వాంఛ అయిన పెండింగ్ డీఏ లు, ఈహెచ్ఎస్, ఇతర పెండింగ్ బిల్లుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో నల్గొండ జిల్లా టీఎన్జీవో యూనియన్ రూపొందించిన 2026 నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆయన బుధవారంఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేస్తూ ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన కోరారు.

# మారుతున్న మునుగోడు ముఖచిత్రం

నల్గొండ (ఏడీఎన్ఎన్):



- మద్యం రహిత నియోజకవర్గంగా మార్చేలా ఎమ్మెల్యే అడుగులు
- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంకల్పానికి కదులుతున్న పల్లెలు
- బెల్ట్ షాపులపై యుద్ధం.. అభినందిస్తున్న మహిళలు

మునుగోడు నియోజకవర్గంలో మద్యం మహమ్మారిని నియంత్రించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని పునర్నిర్మించాలన్న శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంకల్పం ఇప్పుడు ఒక మహోద్యమంలా పల్లెపల్లెకూ పాకుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి చేసే వ్యాపారం సమాజానికి మేలు చేయదనే దృఢ నిశ్చయంతో ఆయన తీసుకుంటున్న చర్యలు నియోజకవర్గ ముఖచిత్రాన్ని మారుస్తున్నాయి. ముఖ్యంగా మద్యం విక్రయ సమయాల్లో మార్పులు చేయాలని కోరడానికి వచ్చిన వ్యాపారులకు, పొద్దంతా మీరు తాగిన తర్వాతే ప్రజలకు తాపించండని, ఆయన ఇచ్చిన నిక్కచ్చి సమాధానం ఇప్పుడు తెలంగాణవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా, మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైన్ షాపులు తెరవకూడదని, సాయంత్రం ఆరు గంటల తర్వాతే పర్మిట్ రూమ్‌లు నిర్వహించాలని ఆయన విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో అక్షరాలా అమలవుతున్నాయి. ఇది గమనించిన మహిళలు, మేధావులు రాజగోపాల్ రెడ్డి చిత్తశుద్ధిని వేనోళ్ల కొనియాడుతున్నారు. ఈ సంకల్పానికి మద్దతుగా ఇప్పుడు పల్లెల్లో యువత, మహిళలు స్వచ్ఛందంగా కదులుతున్నారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె వంటి గ్రామాల్లో యువత భారీ ర్యాలీలు నిర్వహిస్తూ బెల్ట్ షాపుల నిర్మూలనకు నడుం బిగించారు. ప్రతి కిరాణా షాపు యజమానిని కలిసి, రాజగోపాల్ రెడ్డి ఆశయాలకు విరుద్ధంగా చాటుమాటుగా మద్యం అమ్మకాలు జరిపితే ఊరుకోబోమని హెచ్చరిస్తూ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. 2018లోనే బెల్ట్ షాపులను రూపుమాపాలని పిలుపునిచ్చి, ఆ దిశగా అడుగులు వేసిన గ్రామాలకు తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా ఐదు లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన చరిత్ర ఆయనది. నాటి రాజకీయ పరిస్థితుల వల్ల పూర్తిస్థాయిలో సాధ్యం కాకపోయినా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ లక్ష్యాన్ని పకడ్బందీగా ముందుకు తీసుకెళ్తున్నారు. మనిషి జీవన విధానం ప్రకృతికి అనుగుణంగా ఉండాలని, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు కష్టపడి పనిచేయాల్సిన సమయాన్ని తాగుడుకు బానిసై వృథా చేయకూడదన్నది రాజగోపాల్ రెడ్డి ప్రధాన ఉద్దేశ్యం. అతిగా మద్యం సేవించడం వల్ల చిన్న వయసులోనే పురుషులు ప్రాణాలు కోల్పోతూ, అనేక కుటుంబాల్లో మహిళలు అకాల వైధవ్యాన్ని అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, ఈ మార్పు తన నుండే మొదలవ్వాలని భావించి, తన అనుచరులు, అభిమానులు కూడా పగటిపూట మద్యం సేవించవద్దని ఆయన కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. నాయకుడి అడుగుజాడల్లో నడుస్తూ అనుచరులు కూడా పగటిపూట మద్యానికి దూరంగా ఉండటం ఒక విశేష మార్పుగా కనిపిస్తోంది. మునుగోడులో అమలవుతున్న ఈ మద్యం నియంత్రణ విధానం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఒక దిక్సూచిలా నిలుస్తోంది.

# దావోస్‌లో లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక 2026 వార్షిక సదస్సు తెలంగాణ పారిశ్రామిక ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచింది. రాష్ట్రంలో ఫార్మా, వ్యాక్సిన్, బయోటెక్నాలజీ రంగాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30'ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి విడుదల చేసిన ఈ విధాన పత్రం, 2030 నాటికి ప్రపంచంలోని మొదటి మూడు లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణను నిలపడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో దాదాపు మూడో వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, వందలాది అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన తయారీ కేంద్రాలకు నిలయంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు కేవలం పరిమాణంపైనే కాకుండా నాణ్యత, ఆవిష్కరణల పై దృష్టి సారించనుంది. ఈ నూతన పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్ల కాలంలో సుమారు 25 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, ఐదు లక్షల మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఫార్మాస్యూటికల్స్, వ్యాక్సిన్ తయారీతో పాటు అత్యాధునిక పరిశోధనలు, బయోమాన్యుఫ్యాక్చరింగ్, ప్రిసిషన్ మెడిసిన్, డిజిటల్ హెల్త్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలను ఈ విధానంలో ప్రాధాన్యత అంశాలుగా చేర్చారు. గ్లోబల్ వాల్యూ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటు ద్వారా అంతర్జాతీయ పరిశోధనా సంస్థలను రాష్ట్రానికి రప్పించేలా వ్యూహాలను రూపొందించారు. కేవలం పారిశ్రామిక వృద్ధే కాకుండా, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వంటి సుస్థిర పద్ధతులకు ఈ పాలసీలో పెద్దపీట వేశారు. మౌలిక సదుపాయాల పరంగా రాష్ట్రం మరో మెట్టు ఎక్కేలా ఈ పాలసీలో కీలక ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్కులను మరింత విస్తరించడంతో పాటు, సరికొత్తగా గ్రీన్ ఫార్మా సిటీ, రాష్ట్రవ్యాప్తంగా పది 'ఫార్మా విలేజ్'లను నిర్మించనున్నారు. బయోఇన్నోవేషన్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల ద్వారా సరికొత్త పరిశ్రమలకు వేదికగా తెలంగాణను మార్చనున్నారు. ఈ భారీ ప్రాజెక్టుల నిర్వహణలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా గ్రీన్ ఇండస్ట్రియల్ పద్ధతులను ఖచ్చితంగా అమలు చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇవన్నీ రాష్ట్రానికి ఒక సుస్థిరమైన పారిశ్రామిక రూపురేఖలను అందించనున్నాయి. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా 'తెలంగాణ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్'ను స్థాపించి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్ సమన్వయంతో యువతకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ ఇవ్వనున్నారు. కేవలం తయారీ రంగంలోనే కాకుండా క్లినికల్ రీసెర్చ్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో కూడా తెలంగాణ యువత ప్రపంచ స్థాయి నైపుణ్యాలను పొందేలా నిరంతర అభ్యాస ప్రక్రియలను ఈ పాలసీ ప్రోత్సహిస్తుంది. దీనివల్ల స్థానిక యువతకు భారీ ఎత్తున ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. చివరగా, ఈ పాలసీ అమలు తీరును పరిశ్రమల శాఖ, ఐటీ శాఖల సంయుక్త పర్యవేక్షణలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ ముందుకు తీసుకెళ్తుంది. టీజీఐపాస్ ద్వారా నిర్ణీత కాలపరిమితిలో పారదర్శకంగా అనుమతులు మంజూరు చేస్తూ, స్టార్టప్‌లు, చిన్న తరహా పరిశ్రమలకు వెన్నుదన్నుగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026 నుంచి 2030 వరకు అమల్లో ఉండే ఈ విధానం, తెలంగాణను కేవలం భారత ఫార్మా రాజధానిగానే కాకుండా, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు చిరునామాగా మారుస్తుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణిపై ప్రతిపక్షాలు విష ప్రచారం

### మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపణలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):



తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై పోరాడేందుకు ప్రతిపక్షాలు కలిసి రావడం లేదని, దానికి బదులుగా సింగరేణి సంస్థపై విష ప్రచారం చేస్తున్నాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మీడియాతో బుధవారం మాట్లాడిన ఆయన, సింగరేణి వ్యవహారంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రాన్ని నిలదీద్దామంటే రాని ప్రతిపక్ష నేతలు, కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. సింగరేణిపై జరుగుతున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై ఎలాంటి విచారణకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతుండటంతో, తమ తప్పులు బయటపడతాయనే భయంతో బీఆర్ఎస్ నేతలు బీజేపీతో చేతులు కలిపారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సీబీఐ విచారణ నుంచి తప్పించుకోవడానికే కిషన్ రెడ్డి, హరీష్ రావు కలిసి సింగరేణి అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. సింగరేణికి సంబంధించిన అన్ని కేటాయింపులు, ఒప్పందాల వాస్తవాలను బహిర్గతం చేయాలని, ప్రజల ముందు నిజానిజాలు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనవసరపు ఆరోపణలు మాని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. మాజీ మంత్రి హరీశ్ రావుకు పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా బహిరంగ సవాల్ విసిరారు. 2014 నుంచి సింగరేణిలో జరిగిన కాంట్రాక్టులన్నీ పారదర్శకంగా ఉన్నాయని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. గత పదేళ్లలో జరిగిన కాంట్రాక్టుల వివరాలను బయటపెడితే ఎవరి హయాంలో అక్రమాలు జరిగాయో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. సింగరేణిని కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడతామని ఆయన హెచ్చరించారు.

# క్షమాపణ చెప్పకుంటే నిరాహార దీక్ష చేస్తా

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):




అలంపూర్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా ఎమ్మెల్యే విజయుడుపై తాను భౌతిక దాడి చేశానంటూ వస్తున్న వార్తలను నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనపై కావాలనే కొందరు కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అసత్య ప్రచారాలను మానుకుని, తనకు, సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పకపోతే అధిష్టానం అనుమతితో గాంధీ మార్గంలో నిరాహార దీక్షకు కూర్చుంటానని ఆయన హెచ్చరించారు. వడ్డేపల్లిలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమం వద్ద అసలేం జరిగిందో మల్లు రవి వివరించారు. ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటూ వచ్చిన కొందరు వ్యక్తులు కొబ్బరికాయల బస్తాను లాక్కుని గొడవకు దిగారని, ఆ సమయంలో ప్రోటోకాల్ పాటించాలని నేను చెప్పానని, ఇరువర్గాల మధ్య ఘర్షణ పెరిగి రక్తపాతం జరిగే పరిస్థితి ఉండటంతో, గొడవను సద్దుమణిగించేందుకు పోలీసులను పిలిచి గట్టిగా మాట్లాడానని మల్లు రవి అన్నారు. ఎమ్మెల్యేపై జనాలు పడకుండా ఉండేందుకే ఆయన్ను పక్కకు తీసుకెళ్లాను తప్ప, కొట్టడమో లేదా దూషించడమో చేయలేదని, మా ఇద్దరి మధ్య అంతటి చొరవ ఉందని ఆయన స్పష్టం చేశారు. పూర్తి సమాచారం తెలుసుకోకుండా ఒక దళితుడిపై దాడి జరిగినట్లు చిత్రీకరించడం దురదృష్టకరమని మల్లు రవి అన్నారు. తాము ఇద్దరం ప్రజాప్రతినిధులుగా సోదరభావంతో పనిచేస్తున్నామని, ఈ ఘటనపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని ప్రకటించారు. రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను వక్రీకరించి కాంగ్రెస్ ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తే ఊరుకోబోమని, తప్పుడు ప్రచారం చేసిన పత్రికలు మరియు నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణ అభివృద్ధిలో టాటా గ్రూప్ భాగస్వామ్యం

### మూసీ పునరుజ్జీవం, క్రీడా ప్రాంగణాల అప్‌గ్రేడ్‌కు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):



దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'విజన్ 2047' లక్ష్యాలను, పెట్టుబడులకు తెలంగాణలో ఉన్న అనుకూల వాతావరణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ఈ చర్చల ఫలితంగా రాష్ట్రంలోని క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి టాటా గ్రూప్ సానుకూలత వ్యక్తం చేసింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ స్థాయి స్టేడియంలను ఆధునీకరించేందుకు సహకారం అందిస్తామని టాటా ఛైర్మన్ హామీ ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులోనూ భాగస్వామ్యం అయ్యేందుకు టాటా గ్రూప్ ఆసక్తి చూపడం విశేషం. నదీ తీర ప్రాంత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో తమ వంతు తోడ్పాటు అందిస్తామని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే దిశగా కొత్త హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. తయారీ రంగంలో కొత్త యూనిట్ల స్థాపనకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించగా, వాటిని పరిశీలిస్తామని టాటా బృందం వెల్లడించింది. ముఖ్యమంత్రి పర్యటనలో ఇతర కీలక ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. రాష్ట్రంలో కొత్త స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఒప్పందం కుదరడంతో పాటు, ప్రపంచంలోనే అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ 'ఏబీ ఇన్‌బెవ్' తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం జరుపుతున్న ఈ చర్చలు తెలంగాణను పారిశ్రామికంగా మరో స్థాయికి తీసుకెళ్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



## డైలీ సీరియల్‌లా
# ఫోన్ ట్యాపింగ్ విచారణ

మెదక్ (ఏడీఎన్ఎన్):

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ నత్తనడకన సాగుతోందని, ఇది రోజురోజుకూ ఒక 'డైలీ సీరియల్'ను తలపిస్తోందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. మెదక్‌లో మీడియాతో బుధవారం మాట్లాడిన ఆయన, సిట్ విచారణపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొదటి సిట్, రెండో సిట్ అంటూ కాలయాపన చేస్తుంటే, అసలు దోషులు ఎక్కడోళ్లు అక్కడ 'సిట్‌రైట్'అయిపోతున్నారని, ఎద్దేవా చేశారు. పోలీసు వ్యవస్థపై సామాన్యులకు నమ్మకం కలగాలంటే ఈ కేసులో విచారణను వేగవంతం చేసి, బాధ్యులను తక్షణమే 'శ్రీకృష్ణ జన్మస్థానానికి'పంపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గతంలో మెదక్ జిల్లాలో పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారని రఘునందన్ రావు గుర్తు చేశారు. ఆ పేరును నిలబెట్టుకోవాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరికీ తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. కర్త, కర్మ అంతా ఒకరివైపే వేలెత్తి చూపిస్తున్నా, వారిని విచారణకు పిలిచేందుకు పోలీసులు ఎందుకు భయపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విచారణ కేవలం ఎన్నికల స్టంట్‌లా కాకుండా, సాంకేతిక ఆధారాలతో దోషులను శిక్షించేలా ఉండాలన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య సమీకరణాలు మారిపోతాయని సెటైర్లు వేశారు. మూడు రంగుల జెండా గులాబీ జెండాగా మారినా లేదా గులాబీ జెండానే మూడు రంగుల జెండాగా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యానించారు. ఈ కేసులో మొదటి బాధితుడిని తానేనని, తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ నేతలే కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినీ ప్రముఖుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని, దీనిపై పూర్తిస్థాయిలో నిజాలు బయటకు రావాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు.



# సరూర్ నగర్ చెరువుకు మహర్దశ

### ఏడాదిలోగా పునరుద్ధరణ పూర్తి చేస్తామన్న హైడ్రా కమిషనర్


హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):

హైదరాబాద్‌లోని చారిత్రక సరూర్ నగర్ చెరువు పునరుద్ధరణకు హైడ్రా నడుం బిగించింది. ఈ చెరువును క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, చెరువును పూర్వ వైభవానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయని, మార్చి నాటికి పనులు ప్రారంభించి ఏడాది కాలంలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన చెరువులను పునరుద్ధరించే కార్యక్రమంలో భాగంగా సరూర్ నగర్ చెరువును ఒక మోడల్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి, పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, స్థానికంగా భూగర్భజలాలు వృద్ధి చెందేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఒకప్పుడు సుమారు 140 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన ఈ చెరువు, ప్రస్తుతం ఆక్రమణల వల్ల 90 ఎకరాలకు పరిమితమైందని కమిషనర్ రంగనాథ్ వివరించారు. అయితే, ప్రస్తుతం చెరువు చుట్టూ ఉన్న నివాసాల జోలికి హైడ్రా వెళ్లబోదని, ఉన్న విస్తీర్ణంలోనే చెరువును సుందరీకరించి, పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతామని స్థానికులకు హామీ ఇచ్చారు. చెరువులోకి మురుగునీరు నేరుగా చేరకుండా శాస్త్రీయ పద్ధతుల్లో మళ్లింపు చర్యలు చేపడతామని, దీనివల్ల దుర్వాసన సమస్య తొలగిపోవడమే కాకుండా చెరువు జీవవైవిధ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కేవలం సుందరీకరణే కాకుండా, వర్షాకాలంలో చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురవ్వకుండా వరద నియంత్రణ వ్యవస్థను కూడా పటిష్టం చేస్తామని వెల్లడించారు. ముఖ్యంగా చెరువు మధ్యలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తామని రంగనాథ్ తెలిపారు. గతంలో హైడ్రా చేపట్టిన బతుకమ్మ కుంట, కుకట్‌పల్లి నాలా వంటి పునరుద్ధరణ పనులను ఉదాహరణగా చూపుతూ, సరూర్ నగర్ చెరువును కూడా అదే తరహాలో శాస్త్రీయంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానికులకు ఒక అద్భుతమైన వినోద కేంద్రం అందుబాటులోకి రావడమే కాకుండా, నగరంలోని జలవనరుల సంరక్షణలో ఇది ఒక కీలక అడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కార్యకర్తల ఆత్మగౌరవాన్ని
# తాకట్టు పెట్టలేను

- గాంధీభవన్ సమీక్ష నుంచి జీవన్ రెడ్డి వాకౌట్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పక్కన కూర్చోలేనని స్పష్టం
- రచ్చకెక్కిన జగిత్యాల కాంగ్రెస్ వర్గపోరు

జగిత్యాల (ఏడీఎన్ఎన్):



జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేనని, ఇలాంటి వైఖరి పార్టీకి నష్టం చేస్తుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశానికి జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరుకావడంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయాన్ని నిరసిస్తూ ఆయన సమావేశం మధ్యలోనే బయటకు వచ్చేశారు. తర్వాత మీడియాతో మాట్లాడిన జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన వ్యక్తిని, కాంగ్రెస్ అంతర్గత సమీక్షా సమావేశానికి ఎలా ఆహ్వానిస్తారని ఆయన ప్రశ్నించారు. గత పదేళ్లుగా జగిత్యాలలో బీఆర్ఎస్ అకృత్యాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు పోరాటం చేస్తున్నారని, ఇప్పుడు అదే పార్టీ ఎమ్మెల్యేను తమ పక్కన ఎలా కూర్చోబెట్టుకుంటామని నిలదీశారు. ఈ పరిణామం కాంగ్రెస్ శ్రేణుల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఇప్పటికే జిల్లాలో సంజయ్ కుమార్ చేరికపై జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే. తాజా ఘటనతో జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు మరోసారి బహిర్గతమైంది. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఈ వ్యవహారాన్ని ఎలా సర్దుబాటు చేస్తారోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
22.01.2026
www.manasarkar.com

## రాశి ఫలాలు

**22-01-2026 గురువారం**

**మేషం:**
అదనపు ఆదాయ ప్రయత్నాల వల్ల ఆశించిన ఫలితాలుంటాయి. ఉద్యోగంలో సమర్ధతకు గుర్తింపు లభిస్తుంది. ప్రయాణాలు లాభిస్తాయి. ఉద్యోగ, పెళ్లి ప్రయత్నాలలో సానుకూల స్పందన లభిస్తుంది. డాక్టర్లు, లాయర్లు వంటి వృత్తి రంగాలవారికి ఆదాయం బాగా పెరిగే అవకాశముంది. ఆర్థిక సమస్యలు, ఒత్తిళ్ల నుంచి చాలావరకు బయటపడతారు.

**వృషభం:**
వృత్తి, ఉద్యోగాల్లో బరువు బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాల మీద శ్రద్ధ పెంచడం మంచిది. ఆదాయం పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా సాగిపోతాయి. మిత్రులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. పిల్లలు చదువుల మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాలి. కుటుంబ జీవితం హ్యాపీగా సాగిపోతుంది.

**మిథునం:**
వృత్తి, వ్యాపారాల్లో రాబడి కొద్దిగా పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల నుంచి శుభ వార్తలు అందుతాయి. ఉద్యోగంలో బాధ్యతలు బాగా మారిపోయే అవకాశం ఉంది. వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. బంధువులతో కలిసి శుభ కార్యాల్లో పాల్గొంటారు. కొన్ని ఆర్థిక సమ స్యలు, వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి. ముఖ్యమైన కొత్త కార్యక్రమాలు చేపడతారు.

**కర్కాటకం:**
ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది. ఇంటా బయటా మిమ్మల్ని స్వార్థానికి ఉపయోగించుకునేవారి సంఖ్య ఎక్కువవుతుంది. ఆస్తి వివాదంలో రాజీమార్గం అనుసరిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగంలో అధికారులతో అనుకూలత పెరుగుతుంది. ఆదాయం వృద్ధి చెందుతుంది.

**సింహం:**
అధికారుల వేధింపులు, ఒత్తిళ్లు తగ్గే అవకాశం ఉంది. బంధువుల శుభ కార్యాలలో పాల్గొంటారు. అదనపు ఆదాయ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యవహార జయానికి, కార్యసిద్ధికి అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్థిక వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాల్లో శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ఉద్యోగంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**కన్య:**
ఆర్థిక, ఆస్తి వ్యవహారాలను సమర్థవంతంగా చక్కబెడతారు. జీవిత భాగస్వామితో సంప్రదించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. షేర్లు, స్పెక్యులేషన్లు బాగా లాభిస్తాయి. వృత్తి, ఉద్యోగాల్లో బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. వృత్తి జీవితం బాగా బిజీగా, లాభదాయకంగా సాగిపోతుంది.

**తుల:**
అదనపు ఆదాయ ప్రయత్నాల మీద మరింత శ్రద్ధ పెట్టడం మంచిది. ఆర్థిక పరిస్థితులు చాలా వరకు అనుకూలంగా ఉంటాయి. వృత్తి, ఉద్యోగాలలోనే కాక, సామాజికంగా కూడా గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సోదర వర్గంలో సమస్యలు పరిష్కారం అవుతాయి. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. ముఖ్యమైన పనులు, వ్యవహారాలను సకాలంలో పూర్తి చేస్తారు.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించి అధికారులు ఆదరణ పొందుతారు. నిరుద్యోగులకు మంచి ఆఫర్ అందుతుంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ప్రయత్నించడం మంచిది. ఆదాయానికి, ఆరోగ్యానికి లోటుండదు. రావలసిన సొమ్ము చేతికి అందుతుంది. కుటుంబ జీవితం సంతృప్తికరంగా సాగిపోతుంది. దాంపత్య జీవితంలో అన్యోన్యత పెరుగుతుంది.

**ధనస్సు:**
ఆర్థిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. ఎవరితోనూ ఆర్థిక లావాదేవీలు పెట్టుకోవద్దు. వృత్తి, వ్యాపారాల్లో దూసుకుపోతారు. దీర్ఘకాలిక అనారోగ్యం నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యమైన పనులు, వ్యవహారాలను పూర్తి చేస్తారు. ఉద్యోగ జీవితం ప్రోత్సాహకరంగా ఉంటుంది. కుటుంబంలో సుఖ సంతోషాలు పెరుగుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:**
ఆర్థికంగా కలిసి వచ్చే సమయం ఇది. వ్యాపార కార్యకలాపాలు బిజీగా సాగిపోతాయి. ఎవరితోనూ ఆర్థిక లావాదేవీలు పెట్టుకోకపోవడం మంచిది. నిరుద్యోగులకు ఒకటి రెండు ఆఫర్లు అందుతాయి. అధికారులకు మీ సలహాలు, సూచనలు ఉపయోగపడతాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండడం మంచిది. ఆర్థిక పరిస్థితి చాలావరకు అనుకూలంగా ఉంటుంది.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగాల్లో లక్ష్యాలు, బాధ్యతలను పూర్తి చేయడం మీద దృష్టి పెడతారు. వ్యాపారంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఒకటి రెండు సమస్యలుండే అవకాశం ఉంది. చేపట్టిన ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తవుతాయి. కొందరు మిత్రుల వల్ల డబ్బు నష్టపోవడం జరుగుతుంది. ఆర్థిక పరిస్థితి గతం కంటే బాగా మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.

**మీనం:**
ఉద్యోగులకు పదోన్నతికి అవకాశం ఉంది. వ్యాపారాలు, ఉద్యోగాల్లో ఉత్సాహంగా పనిచేసి శుభ ఫలితాలను పొందుతారు. ఒక శుభ కార్యానికి ప్లాన్ చేస్తారు. కుటుంబంలో సామరస్య వాతావరణం నెలకొంటుంది. చిన్ననాటి మిత్రులతో ఎంజాయ్ చేయడం జరుగుతుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

## హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య

**అనంతపురం (ఏడీఎన్ఎన్):**




అనంతపురం - రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున కుమార్తె భవాని (19) ఆత్మహత్య చేసుకుంది. అనంతపురంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ప్రైవేట్ బాలికల హాస్టల్‌లో ఉంటూ నగరంలోని ఓ ప్రైవేటు లా కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్న ఆమె మంగళవారం సాయంత్రం తన గదిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సహచర విద్యార్థినులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. భవాని మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణంగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వన్ టౌన్ పీఎస్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

## ఏపీలో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్: సీఎం చంద్రబాబు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

స్విట్జర్లాండ్ లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్ 2026) సదస్సులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి మరో కీలక ముందడుగు వేశారు. ఇజ్రాయెల్ దేశ ప్రతినిధులు, దౌత్యవేత్తలతో భేటీ అయిన ఆయన.. ఆంధ్రప్రదేశ్‌లో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఇజ్రాయెల్ ఆర్థిక పరిశ్రమల శాఖ మంత్రి నిర బర్కత్, ట్రేడ్ కమిషనర్ రోయ్ ఫిషర్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. ప్రతిపాదనలోని ముఖ్యాంశాలు - ఇజ్రాయెల్‌కు చెందిన దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేలా ఒక ప్రత్యేక పారి



శ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఈ పార్క్ ప్రధానంగా మెడ్‌టెక్ (వైద్య సాంకేతికత), ఏరోడిఫెన్స్ (రక్షణ రంగం), క్లీన్ - టెక్ (పర్యావరణ హిత సాంకేతికత) వంటి రంగాల్లో స్థానిక తయారీని ప్రోత్సహిస్తోంది. రక్షణ రంగం, ఏరోస్పేస్, అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యుఏవి డ్రోన్) వ్యవస్థల అభివృద్ధిపై ఇరుపక్షాలు చర్చలు జరిపాయి. ఇతర రంగాలపై చర్చలు - కేవలం పారిశ్రామిక రంగానికే పరిమితం కాకుండా, ఇజ్రాయెల్ ప్రసిద్ధి చెందిన ఇతర రంగాల్లోనూ సహకారం కోరారు. సముద్రపు నీటిని మంచి నీరుగా మార్చడం, భూగర్భ జలాల నాణ్యత మెరుగుదల కోసం సహకారాన్ని కోరారు. సెమీకండక్టర్ తయారీ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాలపై చర్చించారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు, విద్యా వ్యవస్థలో నాణ్యత పెంపుపై చర్చించారు. చంద్రబాబు నాయుడు ట్వీట్ - దావోస్‌లో ఇజ్రాయెల్ మంత్రి నిర బర్కత్, ఇతర ప్రతినిధులను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. ఏపీలో ఇజ్రాయెల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాను. ఇది స్థానిక తయారీ రంగానికి కొత్త ఊపునిస్తుంది అని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సాంకేతికత, ఆంధ్రప్రదేశ్ వనరులు తోడైతే రాష్ట్రం గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఒప్పందాలు కార్యరూపం దాల్చితే ఏపీ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## దావోస్ వేదికగా తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

### వరంగల్, ఆదిలాబాద్ అభివృద్ధికి సరికొత్త బాటలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం జరిపిన చర్చల ఫలితంగా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, కృత్రిమ మేధ , క్లీన్ ఎనర్జీ , విమానయాన రంగాల్లో బుధవారం కుదిరిన ఈ ఒప్పందాలు రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. తెలంగాణను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికీకరణను విస్తరించాలనే ప్రభుత్వ సంకల్పం ఈ సదస్సులో స్పష్టంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సౌందర్య సాధనాల దిగ్గజం 'లోరియల్' హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలి బ్యూటీటెక్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను




ఏర్పాటు చేయాలని నిర్ణయించడం గమనార్హం. ఈ ఏడాది నవంబర్‌లోనే ప్రారంభం కానున్న ఈ కేంద్రం ద్వారా డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్, ఏఐ , డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయనున్నారు. ఇది గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్‌లో హైదరాబాద్ స్థాయిని మరింత పెంచడమే కాకుండా, విదేశీ సంస్థలకు మన నగరం అత్యంత ఇష్టమైన గమ్యస్థానంగా మారుతోందని నిరూపిస్తోంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలిఫోర్నియాకు చెందిన 'బ్లైజ్' సంస్థతో కుదిరిన ఒప్పందం తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా మార్చనుంది. వచ్చే రెండు దశాబ్దాల్లో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధిని సాధించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. సెమీ కండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్ , ఆటోమేషన్ రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో ఐటీ రంగంలో తెలంగాణ మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లో కొత్త ఆవిష్కరణలకు ఈ ఒప్పందం వేదిక కానుంది. వికేంద్రీకరణే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ లేదా ఆదిలాబాద్ ప్రాంతాలను విమానయాన రంగ హబ్‌లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అమెరికాకు చెందిన 'సర్గడ్' సంస్థతో కుదిరిన ఎంవోయూ ప్రకారం రూ.1,000 కోట్ల పెట్టుబడితో విమానాల మరమ్మత్తు కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ కేంద్రాన్ని వరంగల్ లేదా ఆదిలాబాద్‌లలో ఏర్పాటు చేయాలని సీఎం సూచించడమే కాకుండా, ఆ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి భారీగా ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం ద్వితీయ శ్రేణి నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఎంతో దోహదపడనుంది.

## 'ధర్మరక్షణ సభ'కు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

### షరతులతో కూడిన అనుమతి మంజూరు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

బాలాపూర్ వేదికగా జనవరి 24న నిర్వహించ తలపెట్టిన 'ధర్మరక్షణ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బుధవారం అనుమతిని మంజూరు చేసింది. ఈ సభను శాంతియుతంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించింది. సభకు అవసరమైన తగిన బందోబస్తు కల్పించాలని పోలీసు శాఖకు, అలాగే పారిశుధ్య వసతులు కల్పించాలని జీహెచ్ఎంసీ అధికారులకు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితికి చెందిన యువజన విభాగం 'గణేష్ సేన' ఈ భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది. ఈ సభ ని




ర్వహణకు సంబంధించి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి కోరినప్పటికీ, వారు నిర్ణయం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతో నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించారు. అడ్వకేట్ కరుణ్ సాగర్ కోర్టులో వాదనలు వినిపిస్తూ, ప్రజలకు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించేందుకే ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రమ చొరబాట్లు, రాష్ట్రంలో జరుగుతున్న జనాభా మార్పులు, సామాజిక సవాళ్లు .జాతీయ భద్రత వంటి కీలక అంశాలపై చర్చించడమే ఈ సభ ప్రధాన లక్ష్యమని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పేర్కొంది. ముఖ్యంగా బాలాపూర్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న చొరబాటుదారుల సమస్యపై ప్రజల్లో చైతన్యం తేవాలని నిర్వాహకులు భావిస్తున్నారు. 'జాగో భాగ్యనగర్ ఛలో బాలాపూర్' అనే నినాదంతో జనవరి 24న మధ్యాహ్నం 2 గంటలకు రంగారెడ్డి జిల్లాలోని బాలాపూర్ గణేష్ చౌక్ వద్ద ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. హిందూ సమాజం పెద్ద ఎత్తున ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని గణేష్ సేన పిలుపునిచ్చింది. హైకోర్టు అనుమతి లభించడంతో నిర్వాహకులు సభకు కావాల్సిన ఏర్పాట్లను ముమ్మరం చేశారు. చట్టబద్ధమైన నిబంధనలను పాటిస్తూ, ఎక్కడా ఉద్రిక్తతలకు తావులేకుండా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని వారు వెల్లడించారు.

## అడిషనల్ కలెక్టర్ అక్రమాస్తుల గుట్టురట్టు

### ఏసీబీ సోదాల్లో రూ.7.69 కోట్ల ఆస్తులు గుర్తింపు

**హన్మకొండ (ఏడీఎన్ఎన్):**

హన్మకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా పనిచేస్తున్న అర్రమడ వెంకట్ రెడ్డి అక్రమాస్తుల బాగోతం ఏసీబీ సోదాల్లో బట్టబయలైంది. ఇప్పటికే లంచం తీసుకుంటూ పట్టుబడి సస్పెన్షన్‌లో ఉన్న ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, బుధవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని సరూర్ నగర్ నివాసంతో పాటు మొత్తం 8 చోట్ల ఏకకాలంలో దాడులు నిర్వ



హించారు. ఈ సోదాల్లో వెంకట్ రెడ్డికి సంబంధించి సుమారు రూ. 7,69,38,332 విలువైన స్థిర, చరాస్తులను అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ విలువ ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరిన్ని కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికారులు గుర్తించిన ఆస్తుల్లో హైదరాబాద్ , ఇతర ప్రాంతాల్లో ఉన్న రెండు ఖరీదైన నివాస గృహాలు , ఒక కమర్షియల్ షాపు, ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న 14.25 ఎకరాల వ్యవసాయ భూమిని కూడా ఏసీబీ స్వాధీనం చేసుకుంది. సోదాల సమయంలో రూ. 30 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 44 లక్షల పొదుపు మొత్తాన్ని గుర్తించారు. అలాగే మూడు విలాసవంతమైన కార్లు, 297 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువైన గృహోపకరణాలను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు.

## కండక్టర్లకు శాపంగా మారిన మహాలక్ష్మి పథకం

### ఆర్టీసీ ఎండీకి జేఏసీ విన్నపం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు మేలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కండక్టర్లకు మాత్రం శాపంగా మారుతోందని ఆర్టీసీ జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్టీసీ ఎండీకి బుధవారం సమర్పించిన వినతిపత్రంలో జేఏసీ నాయకులు పలు ఆవేదనకరమైన విషయాలను వెల్లడించారు. బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉన్న సమయంలో, పొరపాటున మహిళలకు ఇవ్వాల్సిన జీరో టికెట్ పురుషులకు వస్తోందని, దీనిని అధికారులు తీవ్రమైన నేరంగా పరి



గణించి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న మండిపడ్డారు. టికెట్ల జారీలో జరిగే చిన్నపాటి మానవ సహజ పొరపాట్లను కూడా ఆసరాగా చేసుకుని, తనిఖీ అధికారులు కనికరం లేకుండా కఠిన శిక్షలు విధిస్తున్నారని జేఏసీ వాపోయింది. విధి నిర్వహణలో జరిగిన చిన్న పొరపాటుకు ఉద్యోగం కోల్పోయిన నర్సంపేట డిపో కండక్టర్ బి.రాజ్ కుమార్ తీవ్ర మనోవేదనకు గురై, ఈ నెల 20న బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. చేయని తప్పులకు ఇలా బలవుతున్న కార్మికుల వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీరో టికెట్ల విషయంలో అనుకోకుండా జరిగే పొరపాట్లకు ఉద్యోగాల నుండి తొలగించకుండా, సంబంధిత అధికారులకు ఆర్టీసీ ఎండీ తగిన ఆదేశాలు ,స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జేఏసీ కోరింది. ఈ సమస్యను ఎండీ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఈడీ మునిశేఖర్ హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

## భర్తను చంపి.. ప్రమాదమంటూ కథలు చెప్పిన భార్య..

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

తన భర్త మెట్లమీద నుంచి పడిపోయి, చనిపోయాడంటూ అందర్నీ నమ్మించేందుకు ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు. హత్యేనని పోస్టుమార్టం రిపోర్టు అసలు నిజాన్ని తేల్చింది! ఆ నివేదిక ఆధారంగా ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తే నిజాన్ని బయటపెట్టింది. తానే మెడకు చున్నీ బిగించి భర్తను హత్య చేశానని అంగీకరించింది. కూకట్‌పల్లిలో ఈ ఘటన వెలుగుచూసింది. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన జగవరపు సుధీర్ రెడ్డి, జగవరపు బ్రహ్మజ్ఞాన ప్రసన్న భార్యాభర్తలు. వీరికి 16, 13 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులున్నారు. ఉపాధి కోసం సుధీర్ రెడ్డి, భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్ వచ్చాడు. కూకట్‌పల్లి పరిధిలోని ఈనాడు హైట్స్‌లో ఈ కుటుంబం ఉంటోంది. సుధీర్‌రెడ్డి ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రసన్న ఇంట్లోనే ఉంటోంది. అయితే ఇటీవల భార్యాభర్తలకు ఒకరిపై మరొకరికి అనుమానాలు బలపడ్డాయి. భార్య మరొకరితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుం



దని సుధీర్ రెడ్డి అనుమానిస్తే, భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడని ప్రసన్న అనుమానం పెంచుకుంది. మనస్పర్థలు పెరగడంతో ఇద్దరూ ఒకే ఇంట్లో ఉంటున్నా ఇద్దరూ ఎవరికి వారే అన్నట్టుగానే ఉంటున్నారు. కొన్నాళ్లుగా సుధీర్ రోజూ మద్యం తాగి ఇంటికొచ్చి ప్రసన్నను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. గతనెల 23న సాయంత్రం తాగొచ్చిన సుధీర్ గొడవపడి భార్యను కొట్టాడు. కోపం పట్టలేక ప్రసన్న అతడిని తిరిగి కొట్టింది. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న సుధీర్ రెడ్డి మెట్లపై నుంచి కిందపడ్డాడు. పైకి లేచిన అతడు, మళ్లీ ప్రసన్నను కొట్టే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఆమె తన చున్నీని సుధీర్ మెడకు బిగించడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. సుధీర్ చనిపోయాక.. ప్రసన్న డయల్ 100కు ఫోన్ చేసి, మద్యం మత్తులో భర్త మెట్లపై నుంచి కిందపడి ప్రాణాలు విడిచాడంటూ పోలీసులకు చెప్పింది. వారొచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. గొంతుపై గాయాలను చూసి ప్రశ్నించగా.. కిందపడ్డాక పక్కనే ఉన్న మంచం అతడి గొంతుపై పడి గాయమైందని చెప్పింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. 28 రోజుల తర్వాత పోస్టుమార్టం నివేదికొచ్చింది. గొంతుపై తాడులాంటిది బలంగా బిగించడంతోనే సుధీర్ మృతిచెందినట్లు నివేదికలో వెల్లడైంది. ప్రసన్నను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా.. తానే హత్యచేసినట్లు వెల్లడించింది. తనకు భర్తను చంపాలన్న ఉద్దేశం లేదని, తనపై అతడు దాడికి పాల్పడటంతో క్షణికావేశంలో హత్య చేశానని చెప్పింది. ఆమెపై కేసు నమోదు చేసిన పోలీసులు, అరెస్టు చేసి, కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు.



## వైద్యుల నిర్లక్ష్యానికి వృద్ధుడు మృతి

### మందుల చీటీ తారుమారుతో ఘోరం

**కామారెడ్డి (ఏడీఎన్ఎన్):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి సిబ్బంది చేసిన చిన్న పొరపాటు ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఒకే పేరు ఉన్న ఇద్దరు రోగుల మందుల చీటీలు తారుమారు కావడంతో, చికిత్స కోసం వచ్చిన వృద్ధుడికి సంబంధం లేని మందులు ఇచ్చారు. ఫలితంగా ఆయన ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దోమకొండ మండలం అంచనూరు గ్రామానికి చెందిన నాగ బాలరాజు (73) అనే వృద్ధుడు నరాల సమస్య థైరాయిడ్ చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అదే సమయంలో అదే పేరుతో ఉన్న మరో డయాబెటిక్ పేషెంట్ కూడా చికిత్స కోసం అక్కడికి వచ్చారు. ఆసుపత్రి సిబ్బంది పేరు పిలిచినప్పుడు నాగ బాలరాజు లోపలికి వెళ్లగా, వైద్యుడు వివరాలు సరిచూసుకోకుండా డయాబెటిక్ పేషెంట్‌కు ఇవ్వాల్సిన హైడోస్ షుగర్ మందులను ఆయనకు రాసిచ్చారు. వైద్యుడు రాసిచ్చిన ఆ మందులను వాడిన కొద్దిసేపటికే బాలరాజు శరీరంలో షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పడిపోయి అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మళ్లీ అదే ఆసుపత్రికి తీసుకువెళ్లగా, కేస్ షీట్ మారిపోయిందని సిబ్బంది అత్యంత నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి విషమించడంతో వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకే పేరు ఉన్నప్పుడు వయస్సు లేదా ఇతర వివరాలను కనీసం సరిచూసుకోకపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని వారు మండిపడుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కామారెడ్డి పట్టణ పోలీసులు సదరు ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడితో పాటు ఇద్దరు కాంపౌండర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది.

## హెచ్ఎండీఏ ప్రాజెక్టులకు సర్కార్ సై

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేలా హెచ్ఎండీఏ ప్రతిపాదించిన పలు 'మహా' ప్రాజెక్టులకు తెలంగాణ ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ నిర్ణయం ద్వారా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తీరడమే కాకుండా, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో హైదరాబాద్ మరో మెట్టు ఎక్కనుంది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ. 2,280 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా బుద్వేల్ వద్ద రూ. 488 కోట్లతో ప్రపంచ స్థాయి 'ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్ 'ను నిర్మించనున్నారు, ఇది నగరానికి ఒక ప్రధాన ప్రవేశ ద్వారం లా నిలవనుంది. అలాగే, బంజారాహిల్స్ లోని ఐసీసీసీ నుంచి శిల్పా లేఅవుట్ వరకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎలివేటెడ్ కారిడార్3 నిర్మాణానికి రూ. 1,656 కోట్ల భారీ వ్యయంతో అనుమతులు లభించాయి. ఈ కారిడార్ అందుబాటులోకి వస్తే ఐటీ కారిడార్ వైపు ప్రయాణం మరింత సులభతరం కానుంది. వీటితో పాటు మరికొన్ని కీలక రహదారుల విస్తరణకు కూడా నిధులు కేటాయించారు. ఎంజీఐటీ వద్ద శంకర్‌పల్లి రోడ్డు నుంచి మణికొండ వరకు పైపులైన్ రోడ్డు విస్తరణ పనుల కోసం రూ. 110 కోట్లు, నానక్‌రాంగూడ నుంచి గచ్చిబౌలి వరకు ఔటర్ రింగ్ రోడ్ ఎడమ వైపు ప్రధాన రహదారి విస్తరణకు రూ. 26.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులన్నీ హైదరాబాద్ అభివృద్ధిని తదుపరి స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీ లేని ప్రయాణాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని హెచ్ఎండీఏ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## కాకినాడ పీబీసీ కాల్వలో స్పిరిట్ లారీ బోల్తా..

**కాకినాడ (ఏడీఎన్ఎన్):**

తొండంగి మండలం ఏవీ నగరం పీబీసీ కాల్వలో ఓ స్పిరిట్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కాల్వలో స్పిరిట్ కలిసిపోయి నీరంతా కలుషితమైంది. పీబీసీ కాల్వ ద్వారా తొండంగి మండలంలోని 16 గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతోంది. ఈ ప్రమాదం వల్ల ఏవీ నగరం పంపింగ్ స్కీమ్ నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. తాత్కాలికంగా ఆ నీటిని తాగవద్దని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.ఈ విషయమై తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య స్పందించారు. అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయమని సూచించారు. శుభ్రమైన తాగునీరు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయం కావడంతో.. సమస్య పరిష్కారం కోసం అధికారులతో ఎమ్మెల్యే చర్చలు నిర్వహించారు. ప్రస్తుతం.. కాల్వలో నీటిని శుభ్రం చేసే పనులు, ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. ప్రజలు హెచ్చరికలను పాటించి, బాటిల్ వాటర్ లేదా ఇతర సురక్షిత మార్గాల్లో తాగునీటిని వాడాలని సూచిస్తున్నారు. ఈ సమస్య త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.



## దేశం కంటే లీగ్‌కే ప్రాధాన్యమా?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


దేశం కోసం ఆడే అంతర్జాతీయ క్రికెట్‌కు ప్రాధాన్యమా? లేక భారీ వేతనాల ఫ్రాంచైజీ లీగ్ లకా? అనే చర్చకు న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ జేమ్స్ నీషమ్ తాజా నిర్ణయం మరోసారి తెరలేపింది. దేశం కంటే బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్లో రాజ్ షాహీ వారియర్స్ తరపున కీలక క్వాలిఫయర్ మ్యాచ్ ఆడటానికే ఆయన ప్రాధాన్యం ఇవ్వడంతో న్యూజిలాండ్ క్రికెట్ అభిమానులు మండిపడు తున్నారు. జనవరి 21 నుంచి భారత్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఎంపికైనప్పటికీ, నీషమ్ చివరి నిమిషంలో జాతీయ జట్టు నుంచి తప్పుకున్నారు. 2026 టీ20 ప్రపంచ కప్‌కు కొన్ని నెలల సమయం మాత్రమే మిగిలి ఉండగా, భారత్ వంటి బలమైన జట్టుతో సిరీస్ ఆటగాళ్ల సన్నద్ధతకు ఎంతో ఉపయోగపడేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తరుణంలో నీషమ్ జాతీయ విధులను పక్కనపెట్టి ఫ్రాంచైజీ బాట పట్టడం న్యూజిలాండ్ క్రికెట్ వర్గాలను, అభిమానులను నిరాశకు గురిచేసింది. అనుభవజ్ఞుడైన నీషమ్ లాంటి ఆటగాడు లేకపోవడం జట్టు సమతుల్యతపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో కివీస్ అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశం తరపున ఆడే అవకాశాన్ని వదిలేసి లీగ్ క్రికెట్‌కు మొగ్గుచూపడం క్షమించరాని చర్యగా వారు అభివర్ణిస్తున్నారు. ప్రపంచ కప్ ప్రణాళికల నుంచి నీషమ్‌ను తప్పించాలని కూడా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఆసక్తికరంగా, ప్రస్తుత బీపీఎల్‌లో నీషమ్ ప్రదర్శన ఆశాజనకంగా లేకపోయినా, ఫ్రాంచైజీ అతనికి ప్రాధాన్యం ఇవ్వడం ఇప్పుడు క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## ఎటెర్నెల్ సీఈఓ పదవికి దీపిందర్ గోయల్ రాజీనామా..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ప్రముఖ ఆన్ లైన్ డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థ ఎటెర్నెల్ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ తన పదవిని రాజీనామా చేస్తున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం బ్లింకిట్ సీఈవోగా పనిచేస్తున్న ఆల్బిందర్ ధీంద్సా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఈ మార్పు ఫిబ్రవరి 1, 2026 నుండి అధికారికంగా అమలులోకి వచ్చేలా కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఈ సమాచారాన్ని కంపెనీ స్టాక్ ఎక్స్చేంజ్‌లకు ఉన్నత స్థాయిలో ఫైల్ చేస్తూ అధికారికంగా ప్రకటించింది. గోయల్ రాజీనామా తరువాత కూడా పూర్తిగా సంస్థ విడివిడిగా కొనసాగబోతున్నట్లు కాదు. ఆయన వైస్ చైర్మన్ గా , డైరెక్టర్గా సంస్థ బోర్డులో కొనసాగుతారని ప్రకటించారు. అయితే దీనికి షేర్‌హోల్డర్ల ఆమోదం అవసరం. ఈ సందర్భంగా దీపిందర్ గోయల్ తన షేర్ హోల్డర్లకు పంపిన లేఖ రాశారు. దీనిలో రాజీనామాకు కారణాలను వివరించారు. ఆయనకు కొత్తగా , ఎక్కువ రిస్క్ ఉన్న ఆవిష్కరణాత్మక ఆలోచనలపై దృష్టి పెట్టాలనే ఆకాంక్ష పెరిగిందని, అందువల్ల సాధారణ నిర్వహణ బాధ్యతలు నుండి దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ కీలక నాయకత్వ మార్పు నేపథ్యంలో ఎటర్నల్ లిమిటెడ్ తన త్రైమాసిక 2025-26 ఆర్థిక ఫలితాలను కూడా ప్రకటించింది. వాటి ప్రకారమే కంపెనీ సంకలిత నికర లాభం 102 కోట్లు రూ. వద్ద 73 శాతం పెరుగుదలతో నమోదు కాగా, ఆపరేషన్ ఆదాయంలో కూడా 200 శాతం కు పైగా వృద్ధి కనిపించింది. ఈ స్థిరమైన ఆర్థిక ప్రదర్శన సంస్థ వ్యూహాత్మక అభివృద్ధికి పునరుజ్జీవనాన్ని ఇస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మార్పు కంపెనీలో మరోసారి కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నట్లు భావిస్తున్నారు. దీపిందర్ గోయల్ వ్యవస్థాపకుడిగా Eternal మొదలు పెట్టినప్పటి నుండి అభివృద్ధి చెందుతున్న ఈ సంస్థకు ఇప్పుడు అనుభవజ్ఞుడైన అధికారి అల్బిందర్ ధీంద్సా నేతృత్వం వహించడం ద్వారా రోజురోజుకీ పెరుగుతున్న ఆన్‌లైన్ డెలివరీ క్విక్ కామర్స్ మార్కెట్లలో మరింత పోటీశక్తిని సాధించగలిగే అవకాశాలు ఉన్నాయి.




## సునామీలా ఏఐ: అంతర్జాతీయ ద్రవ్యనిధి చీఫ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ప్రసంగించిన ఎంఐఎం చీఫ్ క్రిస్టాలినా జార్జివా ఏఐ సాంకేతికతపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ శరవేగంగా విస్తరిస్తూ పరిశ్రమలు, విద్య, వ్యాపారం మాత్రమే కాకుండా రోజువారీ జీవన విధానంపై సునామీలా విరుచుకుపడుతూ సమూలంగా మార్చేస్తోందని పేర్కొన్నారు. దీనివల్ల ఉద్యోగ భద్రతపై తీవ్రంగా ప్రభావితమవుతోందని, కొన్ని రంగాల్లోని ఉద్యోగాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, దీంతో కార్మిక మార్కెట్‌లో పెద్ద మార్పులు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. ఏఐ ప్రభావం దేశాలను బట్టి భిన్నంగా ఉంటుందని ఆమె వివరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో దాదాపు 60 శాతం ఉద్యోగాలపై ఏఐ వల్ల ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇక అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ ప్రభావం సుమారు 40 శాతం వరకు మాత్రమే ఉండవచ్చని తెలిపారు. ముఖ్యంగా నైపుణ్యాలపై ఆధారపడిన ఉద్యోగాలు ఎక్కువగా ఉన్న రంగాలపై ఏఐ ప్రభావం తీవ్రంగా ఉంటుందని స్పష్టం చేశారు. అయితే అదే సమయంలో ఏఐ నైపుణ్యాలు ఉత్పాదకతను గణనీయంగా పెంచి, ప్రపంచ ఆర్థిక వృద్ధికి ఏఐ దోహదపడే అవకాశాలూ ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కోవాలంటే కార్మికులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యంత అవసరమని క్రిస్టాలినా జార్జివా సూచించారు. కొత్త సాంకేతికతలకు అనుగుణంగా శిక్షణ, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ఏఐ వల్ల కలిగే అవకాశాలను అందిపుచ్చుకునేలా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంతర్జాతీయ స్థాయిలో మద్దతు అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

## అభిషేక్ విధ్వంసం.. టీమిండియా విజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీ20 వరల్డ్ కప్ సన్నాహకాల్లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. నాగ్‌పూర్‌లో బుధవారం జరిగిన తొలి పోరులో టీమిండియా 48 పరుగుల తేడాతో కివీస్‌ను చిత్తు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలర్లు సమష్టిగా రాణించి భారత్‌కు అదిరిపోయే విజయాన్ని అందించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే సంజు సామ్ సన్ (10), ఇషాన్ కిషన్ (8) వికెట్లు కోల్పోయి షాక్ తగిలింది. అయితే, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (35 బంతుల్లో 84; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసిన అభిషేక్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32)తో కలిసి మూడో



వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆఖర్లో రింకూ సింగ్ (20 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు మెరిపించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోరు సాధించింది. 239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే దెబ్బ తగిలింది. అర్ష్ దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్లోనే డెవాన్ కాన్వే (0) అవుట్ కాగా, కొద్దిసేపటికే రచిన్ రవీంద్ర (1)ను హార్దిక్ పాండ్యా పెవిలియన్ పంపాడు. ఈ దశలో గ్లెన్ ఫిలిప్స్ (78) విధ్వంసక ఇన్నింగ్స్‌తో భారత్‌ను భయపెట్టాడు. మార్క్ చాప్‌మన్ (39)తో కలిసి ఫిలిప్స్ స్కోరు బోర్డును పరుగులు తీయించినా, వరుణ్ చక్రవర్తి ఈ జోడీని విడదీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చివర్లో డారిల్ మిచెల్ (28), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (20 నాటౌట్) ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శివం దూబే వేసిన ఆఖరి ఓవర్లో రవి బిష్ణోయ్ అద్భుత క్యాచ్ పట్టడంతో మిచెల్ వెనుదిరిగాడు. దీంతో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 190 పరుగులకు పరిమితమైంది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (2/37), శివం దూబే (2/28) రెండేసి వికెట్లు పడగొట్టగా, అర్ష్ దీప్, హార్దిక్, అక్షర్ తలో వికెట్ తీశారు. ఈ విజయంతో భారత్ 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

## ముంబయిపై ఢిల్లీ ఘనవిజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

డబ్ల్యూపీఎల్ లో ముంబయిపై ఘన విజయం సాధించడంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ కీలక విజయం సాధించింది. బలమైన ముంబయి ఇండియన్స్ ను 7 వికెట్ల తేడాతో ఓడించి టోర్నీలో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బౌలింగ్ లో మరిజేన్ కాప్, తెలుగమ్మాయి శ్రీ చరణి అద్భుతంగా రాణించగా.. బ్యాటింగ్ లో లిజెలీ లీ, జెమీమా రోడ్రిగ్స్ ఢిల్లీ విజయానికి బలమైన పునాది వేశారు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ తీవ్ర ఒత్తిడిలోకి వెళ్లింది. ప్రారంభం నుంచే ఢిల్లీ బౌలర్లు కట్టడి చేయడంతో పవర్ ప్లే ముగిసే సరికి ముంబయి 23/2కే పరిమితమైంది. మరిజేన్ కాప్ వరుసగా నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 8 పరుగులే ఇచ్చి ఓపెనర్ హేలీ మాథ్యూస్ ను బౌల్డ్ చేసింది. మరో ఓపెనర్ సంజనను నందని శర్మ పెవిలియన్ కు పంపింది. ఈ దశలో నాట్ సీవర్‌బ్రంట్, హర్మన్ ప్రీత్ కౌర్ జోడీ ముంబయి ఇన్నింగ్స్ ను గట్టెక్కించింది. నాట్ సీవర్ అద్భుతమైన టైమింగ్




- ప్లేఆఫ్స్ ఆశలు నిలుపుకున్న ఢిల్లీ
- రాణించిన జెమీమా, కాప్, లిజెలీ

తో షాట్లు ఆడుతూ అజేయంగా 65 పరుగులు సాధించగా, హర్మన్ ప్రీత్ 41 పరుగులతో మద్దతిచ్చింది. మూడో వికెట్ కు వీరిద్దరూ 78 పరుగుల భాగస్వామ్యం జోడించారు. అయితే హర్మన్ ఔటైన తర్వాత ముంబయికి మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. ఈ సమయంలో రంగంలోకి దిగిన శ్రీ చరణి వరుస వికెట్లు పడగొట్టి ముంబయిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. చివరకు ముంబయి 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ ధీమాగా ఆరంభించింది. షెఫాలి వర్మ, లిజెలీ లీ తొలి వికెట్ కు వేగంగా పరుగులు జోడించారు. లిజెలీ లీ 46 పరుగులతో ఆకట్టుకోగా, షెఫాలి 29 పరుగులతో మంచి ఆరంభం అందించింది. అయితే లిజెలీ వివాదాస్పదంగా స్టంపౌట్ కావడంతో ఢిల్లీపై ఒక్కసారిగా ఒత్తిడి పెరిగింది. ఈ సమయంలో జెమీమా రోడ్రిగ్స్ బాధ్యత తీసుకుని కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. ఆచితూచి బ్యాటింగ్ చేస్తూనే అవసరమైన సమయంలో బౌండరీలు బాదుతూ అజేయంగా 51 పరుగులు సాధించింది. ఆమెకు లారా వోల్వార్ట్ (17) మద్దతివ్వగా, చివర్లో మరిజేన్ కాప్ (10 నాటౌట్) సహకారం అందించింది. ఫలితంగా ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి కీలక విజయాన్ని అందుకుంది. నాలుగు మ్యాచ్ ల్లో మూడు ఓటములతో అట్టడుగు స్థానంలో ఉన్న ఢిల్లీకి ఈ విజయం ఎంతో ఊరటనిచ్చింది. మరో ఓటమి ప్లేఆఫ్స్ అవకాశాలను క్లిష్టతరం చేసే పరిస్థితిలో ఈ గెలుపు జట్టుకు కొత్త ఉత్సాహాన్ని అందించింది. టోర్నీలో ఇంకా పోటీ మిగిలి ఉందని, చివరి వరకూ పోరాడేందుకు సిద్ధమని ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ స్పష్టంగా చాటి చెప్పింది.

## మహిళా ప్లేయర్ల కోసం సానియా మీర్జా 'ది నెక్స్ట్ సెట్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత్ లోని అగ్రశ్రేణి, వర్ధమాన మహిళా క్రీడాకారిణులకు అండగా నిలవాలనే లక్ష్యంతో భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా కీలక ముందడుగు వేసింది. 'ది నెక్స్ట్ సెట్' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సానియా అధికారికంగా ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా మొదట టెన్నిస్ రంగంలో ఉన్న మహిళా అథ్లెట్లకు సంపూర్ణ మద్దతు అందించనున్నట్లు వెల్లడించింది. ప్రొఫెషనల్ క్రీడల్లో మహిళా అథ్లెట్లు ఎదుర్కొనే సవాళ్లు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని 'ది నెక్స్ట్ సెట్'ను రూపకల్పన చేసినట్లు సానియా తెలిపారు. అత్యున్నత స్థాయిలో పోటీ పడే క్రీడాకారిణులకు కేవలం ప్రతిభ సరిపోదని, సరైన మార్గనిర్దేశం, నిర్మాణాత్మక మద్దతు కూడా అంతే అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే కోచింగ్, ఫిజియోథెరపీ, ఫిట్ నెస్ ట్రైనింగ్, మానసిక సన్నద్ధత వంటి అంశాలపై సమగ్ర సహాయం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. టోర్నీలకు సంపూర్ణ సహాయం : 'ది నెక్స్ట్ సెట్'లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే మహిళా క్రీడాకారిణులకు అనుభవజ్ఞులైన కోచులు, ఫిజియో




థెరపిస్టులు, ట్రెయినర్ల సేవలు అందించనున్నారు. గాయాల నివారణ, శారీరక దృఢత్వం, ప్రదర్శన మెరుగుదలపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. దీంతో పాటు ప్రొఫెషనల్ కెరీర్‌లో ఎదురయ్యే ఒత్తిడిని ఎదుర్కొనేలా క్రీడాకారిణులను మానసికంగా కూడా సిద్ధం చేయనున్నట్లు సమాచారం. శిక్షణ శిబిరాలు, కోచింగ్ క్లినిక్‌లు : సానియా మీర్జా ఆధ్వర్యంలోని అకాడమీల్లో ప్రత్యేక టెన్నిస్ శిక్షణ శిబిరాలు, కోచింగ్ క్లినిక్‌లు నిర్వహించనున్నారు. యువ క్రీడాకారిణులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా మార్గనిర్దేశం చేయనున్నారు. దీని ద్వారా భారత మహిళా టెన్నిస్‌కు బలమైన పునాది వేయాలన్నది ఆమె లక్ష్యంగా ఉంది. ఈ సందర్భంగా సానియా మీర్జా మాట్లాడుతూ, "'ది నెక్స్ట్ సెట్'తో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. నా కెరీర్ లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. సరైన సమయంలో సరైన మార్గనిర్దేశం ఎంతగా ఉపయోగపడుతుందో నేను ప్రత్యక్షంగా అనుభవించాను. భారత మహిళా టెన్నిస్ లో ప్రతిభకు కొదవలేదు. కానీ చాలామందికి అవసరమైన మద్దతు అందక ముందుకు రాలేకపోతున్నారు. సరైన సహాయం అందితే మన క్రీడాకారిణులు ప్రపంచ వేదికపై గట్టి పోటీ ఇవ్వగలరు" అని తెలిపారు. మహిళా క్రీడాకారిణులకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే వ్యవస్థను నిర్మించడమే 'ది నెక్స్ట్ సెట్' లక్ష్యమని సానియా స్పష్టం చేశారు. టెన్నిస్‌తో మొదలైన ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఇతర క్రీడలకు కూడా విస్తరించే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు.

## బడ్జెట్ 2026పై సీనియర్ సిటిజన్ల ఆశలు ఫలిస్తాయా?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కేంద్ర బడ్జెట్ 2026 సమీపిస్తున్న నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్, పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలపై వచ్చే వడ్డీ ఆదాయానికి సంబంధించిన పన్ను మినహాయింపులను ప్రభుత్వం మరింత పెంచవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనితో వారు ఎంతగానో ఆశ పడుతున్నారు. రోజువారీ ఖర్చుల కోసం ఈ పథకాలపై ఎక్కువగా ఆధారపడే పదవీ విరమణ పొందిన వారికి ఇది గణనీయమైన ఆర్థిక ఊరటగా మారనుందని విశ్లేషకులు చెబుతున్నారు. గత బడ్జెట్ లో ఆదాయపు పన్ను పరంగా టీడీఎస్ మినహాయింపులను విస్తరించిన కేంద్రం, రాబోయే బడ్జెట్ లో సాధారణ పౌరులతో పాటు సీనియర్ సిటిజన్లకు మరింత ఉపశమనం కల్పించవచ్చని అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఎఫ్‌డీలు, అద్దె ఆదాయంపై టీడీఎస్ పరిమితులను



- పన్ను, టీడీఎస్‌లో ఉపశమనం కోసం ఎదురుచూపులు
- సీనియర్ సిటిజన్లకు ఈ మినహాయింపులు

పెంచే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 202526 ఆర్థిక సంవత్సరం నుంచి సీనియర్ సిటిజన్లకు డిపాజిట్ వడ్డీపై టీడీఎస్ పరిమితిని రూ.50,000 నుంచి రూ.1 లక్షకు పెంచారు. అయినప్పటికీ, వడ్డీ ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడే పదవీ విరమణ చేసిన వారి దృష్ట్యా ఈ పరిమితిని మరింత పెంచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అద్దె ఆదాయానికి సంబంధించి కూడా ఇటీవల ఉపశమనం కల్పించారు. వార్షిక టీడీఎస్ పరిమితిని రూ.2.40 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచడం అద్దె ఆదాయం పొందుతున్న వారికి లాభం చేకూర్చింది. అయితే పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని ఇంకా పెంచాలని కోరుతున్నారు. పన్ను విధానాల విషయానికి వస్తే, పాత పన్ను విధానంలో ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు ప్రాథమిక మినహాయింపు పరిమితి రూ.3 లక్షలు కాగా, 80 ఏళ్లు పైబడిన వారికి ఇది రూ.5 లక్షల వరకు ఉంటుంది. కొత్త పన్ను విధానంలో ఈ ప్రాథమిక మినహాయింపును రూ.4 లక్షలకు పెంచారు. అయితే రాబోయే బడ్జెట్ లో పాత పన్ను విధానంలోనూ మరిన్ని మార్పులు జరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

## గ్లోబల్ ఐటీ టాప్ బ్రాండ్స్ గా టీసీఎస్, ఇన్ఫోసిస్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అంతర్జాతీయంగా అత్యంత విలువైన ఐటీ సేవల బ్రాండ్ల జాబితాలో భారత ఐటీ దిగ్గజాలు మరోసారి సత్తా చాటాయి. ప్రముఖ బ్రాండ్ విలువల అంచనా సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన 'ఐటీ సర్వీసెస్ 2025 - 2026' నివేదిక ప్రకారం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇన్ఫోసిస్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో మొత్తం 25 సంస్థలు చోటు దక్కించుకోగా, వాటిలో అమెరికా, భారత్ నుంచి చెరో 8 కంపెనీలు ఉండడం విశేషం. గత ఎనిమిదేళ్లుగా అగ్రస్థానాన్ని కాపాడుకుంటున్న అమెరికన్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ఈసారి కూడా తొలి స్థానంలో నిలిచింది. 42.2 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.3.80 లక్షల కోట్ల బ్రాండ్ విలువతో యాక్సెంచర్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. గ్లోబల్ ఐటీ సేవల రంగంలో యాక్సెంచర్ ఆధిపత్యం కొనసాగుతోందని ఈ నివేదిక స్పష్టం చేసింది. భారత ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ వరుసగా ఐదో సంవత్సరమూ రెండో స్థానాన్ని నిలబెట్టుకుంది. 21.2 బిలియన్ డాలర్లు అంటే సుమారు




- 'ఐటీ సర్వీసెస్ 2025 –2026 జాబితాలో 2,3 స్థానాల్లో
- అమెరికాతో సమానంగా భారతీయ కంపెనీలు

రూ.1.91 లక్షల కోట్లు బ్రాండ్ విలువతో టీసీఎస్ ప్రపంచంలోనే అత్యంత విశ్వసనీయ, నమ్మదగిన ఐటీ సేవల బ్రాండ్‌గా గుర్తింపు పొందింది. క్లయింట్ నమ్మకం, స్థిరమైన వృద్ధి, విస్తృత గ్లోబల్ ఉనికి టీసీఎస్ విజయానికి ప్రధాన కారణాలుగా బ్రాండ్ ఫైనాన్స్ పేర్కొంది. ఇక ఇన్ఫోసిస్ వేగవంతమైన వృద్ధిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. గత ఆరేళ్లుగా ఏటా సగటున 15 శాతం చొప్పున బ్రాండ్ విలువను పెంచుకుంటూ వస్తున్న ఇన్ఫోసిస్, 16.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.1.48 లక్షల కోట్ల బ్రాండ్ విలువతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. డిజిటల్ ట్రాన్స్ ఫార్మేషన్, ఏఐ, క్లౌడ్ సేవలపై గట్టి దృష్టి పెట్టడం ఇన్ఫోసిస్ వృద్ధికి దోహదపడిందని నివేదిక పేర్కొంది. ఈ జాబితాలోని తొలి 10 స్థానాల్లోనే మరిన్ని భారత కంపెనీలు చోటు దక్కించుకోవడం విశేషం. హెచ్సీఎల్ టెక్నాలజీస్, విప్రో కూడా టాప్10లో నిలిచి భారత ఐటీ బలాన్ని ప్రపంచానికి చాటాయి. ఇక టెక్ మహీంద్రా 12వ స్థానంలో నిలవగా, తదుపరి స్థానాల్లో ఎల్టీఐమైండ్, పర్సిస్టెంట్ సిస్టమ్స్, హెగ్జావేర్ టెక్నాలజీస్ వంటి భారత సంస్థలు ఉన్నాయి. ఈ నివేదిక ద్వారా గ్లోబల్ ఐటీ సేవల రంగంలో భారత కంపెనీల విశ్వసనీయత, నాణ్యత, నిరంతర వృద్ధి మరోసారి రుజువైంది. డిజిటలైజేషన్, ఏఐ, క్లౌడ్ ఆధారిత సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో, రానున్న సంవత్సరాల్లో కూడా భారత ఐటీ బ్రాండ్ల విలువ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నెం.1గా న్యూజిలాండ్ బ్యాటర్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 845 పాయింట్లతో తొలి స్థానంలో నిలిచిన మిచెల్, ఇంతకు ముందు నం.1గా ఉన్న భారత దిగ్గజం విరాట్ కోహ్లిని వెనక్కి నెట్టాడు. కోహ్లి 795 పాయింట్లతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నిరాశపరిచిన హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ఒక స్థానం కోల్పోయి నాలుగో స్థానానికి దిగజారాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 757 పాయింట్లు ఉన్నాయి. మూడో స్థానంలో 764 పాయింట్లతో అఫ్ఘానిస్థాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ నిలిచాడు. శుభ్‌మన్ గిల్ 723 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత ఆటగాళ్లలో కేఎల్ రాహుల్ (670) పదో స్థానంలో, శ్రేయస్ అయ్యర్ (656) 11వ స్థానంలో ఉన్నారు. ఇటీవల భారత్-న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో డారిల్ మిచెల్ అద్భుత ప్రదర్శన చేశాడు. 176 సగటుతో 352 పరుగులు సాధించిన అతడు రెండు సెంచరీలు (137, 131), ఒక అర్ధ సెంచరీ (84)తో ఆకట్టుకున్నాడు. అదే సిరీస్ లో విరాట్ కోహ్లి 80 సగటుతో 240 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ (124), ఒక హాఫ్ సెంచరీ (93) ఉన్నాయి. అయితే రాజ్ కోట్‌లో జరిగిన రెండో వన్డేలో కోహ్లి 24 పరుగులకే ఔటయ్యాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత నం.1 ర్యాంక్ సాధించిన కోహ్లి, కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ రెండో స్థానానికి చేరాడు. ఇక ఇతర ఫార్మాట్ల ర్యాంకింగ్స్ విషయానికి వస్తే, టీ20 బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ 908 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, తిలక్ వర్మ 805 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. టెస్ట్ బ్యాటింగ్‌లో జో రూట్ (880) తొలి స్థానంలో ఉండగా, యశస్వి జైస్వాల్ ఎనిమిదో, శుభ్‌మన్ గిల్ పదో స్థానాల్లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్ లో టెస్టుల్లో బుమ్రా, టీ20ల్లో వరుణ్ చక్రవర్తి, వన్డేల్లో రషీద్ ఖాన్ అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు.



## వరుసగా మూడోరోజూ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం కూడా నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చిత పరిస్థితులు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. రోజంతా తీవ్ర ఊగిసలాట కనిపించిన మార్కెట్ చివరకు నష్టాల్లో స్థిరపడింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో ఒక దశలో సెన్సెక్స్ 1,000 పాయింట్లకుపైగా నష్టపోయి 81,124.45 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత కొన్ని బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు రావడంతో నష్టాల తీవ్రత కొంత తగ్గింది. చివరికి సెన్సెక్స్ 270.84 పాయింట్లు కోల్పోయి 81,909.63 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 270 పాయింట్లు, నిఫ్టీ 75 పాయింట్లు నష్టం చవిచూశాయి. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పడిపోయింది. రూపాయి ఒక దశలో 91.74 వద్ద ఆల్‌టైమ్ కనిష్టాన్ని నమోదు చేసింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల అమ్మకాలు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఇందుకు కారణంగా నిలిచాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు ఎటెర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండిగో, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, కెమికల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలో అమ్మకాలు జోరుగా కొనసాగాయి. బంగారం ధర ఔన్సుకు 4,862 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## ఆల్ టైమ్ రికార్డు స్థాయిలో రూపాయి పతనం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. బుధవారం జరిగిన ట్రేడింగ్‌లో రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొని ఒక దశలో డాలర్ కు 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్టస్థాయిని నమోదు చేసింది. ఒక్కరోజులోనే రూపాయి 77 పైసలు నష్టపోవడం మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేసింది. గత ట్రేడింగ్ సెషన్ లో 90.97 వద్ద ముగిసిన రూపాయి, బుధవారం ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ కొనసాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ మరింత పడిపోయింది. ముఖ్యంగా బంగారం, వెండి దిగుమతులు గణనీయంగా పెరగడం వల్ల డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయిపై అదనపు భారాన్ని మోపింది. అదే సమయంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కూడా రూపాయి పతనానికి ప్రధాన కారణంగా మారింది. స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న అమ్మకాల ధోరణి కరెన్సీ మార్కెట్ పై ప్రతికూల ప్రభావం చూపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. అమెరికా-యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు మళ్లీ తెరపైకి రావడం, అలాగే గ్రీన్ లాండ్ ను స్వాధీనం చేసుకునే దిశగా అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు గ్లోబల్ మార్కెట్లలో అనిశ్చితిని పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడంతో డాలర్ బలపడగా, రూపాయి మరింత బలహీనపడింది. దేశీయంగా స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం కూడా రూపాయి విలువను దిగజార్చిన మరో అంశంగా మారింది. గ్లోబల్ సంకేతాలు మెరుగుపడకపోతే, సమీప కాలంలో రూపాయి ఒడిదుడుకులు కొనసాగవచ్చని కరెన్సీ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# స్టార్ హీరోయిన్ రేంజ్ ఎప్పుడో..?

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

యువతరం హాట్ ఫేవరెట్ హీరోయిన్ గా పేరు దక్కించుకున్న బ్యూటీ రాశీ ఖన్నా. ఈ సుందరి ప్రస్తుతం సోషల్ మీడియాలో తన స్టన్నింగ్ లుక్ తో యువతరం గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. 'మద్రాస్ కెఫే' అనే అని హిందీ చిత్రంలో ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్ సింగ్ భార్య రూబీ సింగ్ పాత్ర ద్వారా సినీ రంగా ప్రవేశం చేసింది. తెలుగులో తొలిసారి అక్కినేని ఫ్యామిలీ ప్రెస్టేజియస్ మూవీ 'మనం'లో చిన్న పాత్ర పోషించి తెలుగు తెరకు పరిచయమైంది. ఈ ఒక్క పాత్ర ఈమెకు హీరోయిన్ గా అవకాశం అందేలా చేసింది. అలా తొలిసారి 'ఊహలు గుసగుసలాడే'లో శ్రీ సాయి శిరీష ప్రభావతి అనే పాత్ర పోషించి తన నటనతో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా మంచి పేరు దక్కించుకుంది. ఈ సినిమా తర్వాత వరుసగా జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీం , హైపర్, జై లవకుశ, రాజా ది గ్రేట్, శ్రీనివాస కళ్యాణం ఇలా పలు తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇటు తెలుగులోనే కాకుండా అటు తమిళ్లో కూడా వరుస సినిమాలు చేసి మెప్పించింది. ఇకపోతే వరుసగా చిత్రాలు చేస్తోంది కానీ స్టార్ హీరోయిన్ రేంజ్ లో అవకాశాలు అయితే లభించడం లేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తోంది. ఇందులో శ్రీలీల మరో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే.. మరోవైపు మరో తెలుగు చిత్రంలో నటిస్తున్న ఈమె అటు హిందీ ' నాగ్జిల్లా: నాగ్ లోక్ కా పెహ్లాకాంద్' అనే హిందీ సినిమాలో కూడా నటిస్తోంది. అంతేకాదు విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్న ఒక హిందీ సినిమాలో కూడా అవకాశం దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అలాగే హిందీ వెబ్ సిరీస్ ఫర్జీ 2 లో కూడా నటిస్తోంది. షాహిద్ కపూర్ తో కలిసి ఈ సీక్వెల్ లో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు ఆర్ మాధవన్ తో కలిసి ఒక టైం ట్రావెల్ మూవీ చేస్తున్న ఈమె ఒక పంజాబీ వెబ్ సిరీస్ లో కూడా నటిస్తూ వార్తల్లో నిలిచింది.



# నవీన్ చంద్ర 'హనీ' టెర్రిఫిక్ టీజర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓ.వి.ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ తో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజిక్ ఎలిమెంట్స్ తో ఉండబోతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. వెన్నులో వణుకు పుట్టించేలా వున్న టీజర్ సినిమాపై అమాంతం ఆసక్తిని పెంచింది. ఇప్పటివరకు మనం చూసిన హారర్ కు భిన్నంగా 'హనీ' టీజర్ పూర్తిగా నిశ్శబ్దం, చీకటి, మర్మమైన చూపులు, తెలియని శక్తులు.. ఇవన్నీ కలిసి ఒక మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దర్శకుడు కరుణ కుమార్ ఇప్పటివరకు ఎన్నడూ చూడని కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాడనే సంకేతాలు టీజర్‌లో బలంగా వినిపిస్తున్నాయి. హారర్‌ను కేవలం భయపెట్టే అంశంగా కాకుండా ఊహకు అతీతంగా ప్రజెంట్ చేస్తున్న విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ "ఏదో పెద్ద రహస్యం దాగుంది" అన్న ఫీలింగ్ కలుగుతుంది. నవీన్ చంద్ర లుక్ పెర్ఫార్మెన్స్ స్టన్నింగ్ గా వుంది. దివి, రాజా రవీంద్ర పాత్రలు కూడా భిన్నంగా కనిపించాయి. అజయ్ అరసాడ సంగీతం బీజీఎం గూస్బంప్స్ తెప్పించింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్, నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాల సమ్మేళనంతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించేందుకు సిద్ధంగా ఉంది.

## వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో
# మెగాస్టార్ చిరంజీవి



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సు-2026లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి స్విట్జర్లాండ్‌లోని జురిచ్ లో ఉన్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి, ఆయన్ని సదస్సుకు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి ఆహ్వానాన్ని గౌరవిస్తూ చిరంజీవి సదస్సుకు హాజరై, వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికపై ఆవిష్కరించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ను ప్రత్యక్షంగా వీక్షించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని ప్రతిబింబించిన ఈ ఘట్టం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవిని ఘనంగా ఆహ్వానించారు. తమ కుటుంబ సభ్యులతో పాటు మనవళ్లతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాను వీక్షించానని, సినిమాను ఎంతో ఆస్వాదించానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సినిమా అందించిన వినోదం పట్ల ఆయన తన అభినందనలను వ్యక్తిగతంగా చిరంజీవి గారితో పంచుకున్నారు. స్విట్జర్లాండ్‌లో అనుకోకుండా కలుసుకున్న ఈ సదస్సు సందర్భంగా స్నేహపూర్వకంగా కలసి మంచి సమయాన్ని గడిపారు. చిరంజీవి కుటుంబంతో కలిసి వ్యక్తిగత విహారయాత్ర నిమిత్తం స్విట్జర్లాండ్‌కు వెళ్లిన సమయంలోనే ఈ ఆహ్లాదకరమైన సమావేశం.. అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడం చోటు చేసుకుంది.

# 'డెకాయిట్'లో మృణాల్ షూటింగ్ పూర్తి

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

వరుస బ్లాక్‌బస్టర్‌లతో దూసుకుపోతున్న అడివి శేష్ ఇప్పుడు తన ప్రతిష్టాత్మకమైన చిత్రం 'డకాయిట్'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇందులో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. తాజాగా మృణాల్ ఠాకూర్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఒక భారీ షెడ్యూల్‌లో తన షూటింగ్ ఫినిష్ చేశారు. చిత్ర బృందం ఆమెకు ఘనంగా సెండ్ ఆఫ్ ఇచ్చింది, ఆమె అన్ని ప్రమోషనల్ యాక్టివిటీస్ భాగమవుతారు. ఆమె తన పాత్రకు తెలుగు, హిందీ రెండు భాషలలో



డబ్బింగ్ కూడా చెబుతున్నారు. ఇటీవల, చిత్ర నిర్మాతలు రిలీజ్ చేసిన సినిమా టీజర్ కు అద్భుతమైన స్పందన లభించింది. శేష్ డిఫరెంట్ అవతార్, రఫ్ లుక్‌ల, మాస్ యాటిట్యూడ్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఉన్నత నిర్మాణ విలువలతో రూపొందుతోంది. సినిమాటోగ్రఫీని ధనుష్ భాస్కర్ అందించగా, భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. నేపథ్య సంగీతాన్ని జ్ఞాని అందించారు. సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రం, తెలుగు నూతన సంవత్సరం అయిన ఉగాది పండుగ సందర్భంగా గ్రాండ్ గా విడుదలవుతోంది.



# 'పల్లి చట్టంబి' మోషన్ పోస్టర్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లి చట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ రోజు "పల్లి చట్టంబి" సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్ ను కూడా వెల్లడించారు. ఏప్రిల్ 9న ఈ ప్రెస్టీజియస్ మూవీని హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నారు. "పల్లి చట్టంబి" మోషన్ పోస్టర్ సినిమా మీద పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెంచుతోంది.




## 'శుభకృత్ నామ సంవత్సరం'
# గ్లింప్స్ విడుదల

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

నవరసరాయ డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'శుభకృత్ నామ సంవత్సరం'. ఎస్ఎస్ సజ్జన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్వి పిక్చర్స్, అవిష్క డ్రీ ప్రొడక్షన్ బ్యానర్స్ పై డిఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ.. మా కుటుంబంలో సగమైన ఫ్యాన్స్ కి పేరుపేరునా కృతజ్ఞతలు. మా కుటుంబంలో ఏదైనా సరే మాతో వచ్చి నిలబడే ఫ్యాన్స్ ని కృష్ణగారు మాకు ఇచ్చి వెళ్లారు. రామోజీరావు గారు జంధ్యాల గారు నాకు ఒక ఫ్యామిలీ. వాళ్ళు వెళ్లిపోయిన తర్వాత చాలా డిప్రెషన్ ఫీల్ అయ్యాను. ఆ తర్వాత శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు మరో ఫ్యామిలీ లాగా వచ్చారు. నాకోసం ఒక క్యారెక్టర్ రాయడం అనేది నాకు ఎంతో బలాన్ని ఇస్తుంది. శ్రీ విష్ణు మై హీరో. మహేష్ తర్వాత అంత మంచి షటిల్ గా ఉండే టైమింగ్ తనలో చూశాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా అద్భుతంగా ముందుకు వెళ్తున్న కొద్దీ లీడ్ రోల్స్ కూడా మొదలయ్యాయి. అయితే నేను ప్రతిదీ క్యారెక్టర్ గానే చూస్తాను. నాకు అద్భుతమైన క్యారెక్టర్స్ ఇచ్చిన ప్రతి డైరెక్టర్ కి పేరున కృతజ్ఞతలు. తెలుగు కన్నడ సిస్టర్ లాంగ్వేజ్. ఒకటే లిపి ఉంటుంది. కల్చర్ దగ్గరగా ఉంటుంది. శుభకృత్ నామ సంవత్సరం కథ చాలా నచ్చింది. అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా. ఇది డ్రామా సస్పెన్స్ ట్రావెల్ అన్ని అద్భుతంగా ఉంటాయి. చాలా వేరియేషన్స్ ఉన్న సినిమా. తెలుగు కన్నడలో చాలా మంచి స్టార్ కాస్ట్ తో వస్తున్న సినిమా ఈ టైటిల్ వినగానే అందరూ చాలా పాజిటివ్ గా ఉంది అంటున్నారు. అద్భుతమైన విజయం సాధించే అన్ని అర్హతలు ఈ సినిమాకు ఉన్నాయి. ఈ సినిమా ఖచ్చితంగా తెలుగు కన్నడలో చాలా మంచి పేరు తీసుకొస్తుంది. ప్రతి సంవత్సరం మన తెలుగు సినిమా కళకళలాడాలి. నారీ నారీ సినిమాకు సింగిల్ స్క్రీన్ థియేటర్ కి వెళ్దామని అనుకున్నాను. అన్నీ హౌస్ ఫుల్ వున్నాయి, ఫస్ట్ టైం నా సినిమాకి నాకు టికెట్స్ దొరకలేదు. షాక్ అయ్యాను. మల్టీప్లెక్స్ లో కూడా కేకలు అరుపులతో సినిమా చూస్తున్నారు. ఆ రెస్పాన్స్ చూసి చాలా షాక్ అయ్యారు. మంచి ఎంటర్టైన్మెంట్ కి ఇండస్ట్రీలో ది గ్రేట్ టైం. పరిశ్రమలో 54 ఏటా పెట్టాను.

## ఓం శాంతి శాంతి శాంతిః
# యూనివర్సల్‌గా కనెక్ట్ అయ్యే కథ

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



డైరెక్టర్ ఎ.ఆర్ సజీవ్ ఇంటర్వ్యూ..

మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్ లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఎ.ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. 'ఓం శాంతి శాంతి శాంతిః' ఈ నెల 23న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎఆర్ సజీవ్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి?**
మాది వెస్ట్ గోదావరి, నిడదవోలు. డైరెక్టర్ సంకల్ప్, నందకిషోర్ దగ్గర పని చేశాను. అలాగే స్టాండ్ అఫ్ రాహుల్ సినిమాకి అసోసియేట్ గా వర్క్ చేశాను. చాలామంది దర్శకులతో రైటింగ్ టీం లో వర్క్ చేశాను. నాకు డైరెక్టర్ కావాలనే స్ఫూర్తినిచ్చింది వి.వి. వినాయక్ గారు. ఆయనది మా ఊరు పక్కనే. ఫస్ట్ టైం ఆయన్ని థియేటర్ విజిట్ లో చూసినప్పుడు అక్కడ ఆడియన్స్ ఆయనకు ఇచ్చిన రెస్పాన్స్ ని చూసి డైరెక్టర్ అవ్వాలనిపించింది.

**ఇది ఒక రిమేక్ స్టోరీ కదా.. మీ మొదటి కథగా ఈ సినిమా చేయడానికి కారణం?**
అది ప్రొడక్షన్ వైపు నుంచి వచ్చిన అవకాశం. 35 చిన్న కథ సినిమాకి డైరెక్టర్ నందకిశోర్ గారితో కలిసి పని చేశాను. ఇదే ప్రొడక్షన్ హౌస్ లో నా సొంత కథ అడిగారు. అయితే ఒక రెండు నెలల తర్వాత ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా లాంటి ఒక పెద్ద టీం తో నా ఫస్ట్ సినిమా చేయడమైనది అదృష్టంగా భావిస్తున్నాను.

**తెలుగు విషయానికొచ్చేసరికి ఎలాంటి మార్పులు చేర్పులు చేశారు?**
ఆ కథలోని కోర్ పాయింట్ ని తీసుకున్నాను. ఇది యూనివర్సల్ గా అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అక్కడికి ఇక్కడికి కల్చర్ విషయంలో చాలా డిఫరెన్స్ ఉంటుంది. బ్యాక్ డ్రాప్ ని గోదారి ప్రాంతానికి మార్చాము. దాదాపుగా 60శాతం కథని మార్చాము. చివరి 30 నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. ఫైట్ ఒకటే కామన్ గా ఉంటుంది కానీ మిగతాదంతా కొత్తగా ఉంటుంది.

**తరుణ్ గారు ఆల్రెడీ పాపులర్ డైరెక్టర్ ఆయన్ని డైరెక్ట్ చేసినప్పుడు ఆయన ఇచ్చిన సపోర్ట్ ఏమిటి?**
ఆయన చాలా మోరల్ సపోర్ట్ చేశారు. ఆయన దగ్గరే అసిస్టెంట్ గా జాయిన్ అవ్వాలి అనుకున్నాను. అలాంటిది ఆయన్ని డైరెక్ట్ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఫస్ట్ డే షూట్ కాస్త టెన్షన్ పడ్డాను. కానీ తర్వాత ఆయన నన్ను చాలా కంఫర్ట్ గా చూసుకున్నారు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఆయనకి ఫైనల్ కాపీ మాత్రమే చూపించాను. మధ్యలో రఫ్ కట్టు కూడా చూపించలేదు. మూవీ చూసి చాలా మెచ్చుకున్నారు. తరుణ్ గారు ఈ సినిమాలో గోదారి యాస మాట్లాడడానికి చాలా ప్రిపేర్ అయ్యారు. చాలా హోంవర్క్ చేశారు నిజంగా ఆయన ఆయాసలో పలికే డైలాగులు చాలా సర్ప్రైజ్ గా ఉంటాయి. తరుణ్ అన్న అనగానే మనకి తెలంగాణ స్లాంగే గుర్తొస్తుంది. ఇందులో కంప్లీట్ గోదావరి యాసని ఆడియన్స్ చూస్తారు. సినిమా చూసి తరుణ్ గారు చాలా సర్ప్రైజ్ అయ్యారు. నాకంటే ఎక్కువగా ఆనందపడ్డారు.

**మ్యూజిక్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు ?**
ఒరిజినల్ నుంచి ఒక్క ట్రాక్ కూడా వాడుకోలేదు. కంప్లీట్ గా కొత్త మ్యూజిక్ చేయడం జరిగింది. ఒరిజినల్ కంటే తెలుగులో ఎక్కువ సాంగ్స్ ఉన్నాయి. మొత్తం ఏడు పాటలు. అన్ని పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి. ఇది కంప్లీట్ గా కమర్షియల్ సినిమా. ఇవివి సత్యనారాయణ గారి సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎంటర్టైన్మెంట్ ఎమోషన్ ఏ విధంగా రన్ అవుతుందో ఈ సినిమాలో కూడా అంత చక్కని వినోదం కుదిరింది.


**ఇందులో క్యారెక్టర్స్ ఎలా ఉండబోతున్నాయి?**
తరుణ్ గారి క్యారెక్టర్ చేపల వ్యాపారం చేసే వ్యక్తి. ఒక చేప జీవితాన్ని మెటఫర్ గా తీసుకుని ఆ క్యారెక్టర్ ని డిజైన్ చేయడం జరిగింది. చేపకి మనం ఫుడ్ వేసినప్పుడు అది పొడుచుకునే తింటుంది. తరుణ్ క్యారెక్టర్ ఆ ఊర్లో తన తండ్రి మామయ్యను చూస్తూ పెరిగిన క్యారెక్టర్. ఆ ఊరు తప్పితే అక్కడ మరో ప్రపంచం తెలియదు. అలాగే శాంతి పాత్రని క్యాషియో(జీడి)ని మెటాఫర్ గా తీసుకోవడం జరిగింది. మనం క్యాషియో నట్ ని తీసుకొని ఆ పండుని బయట పారేస్తాం. నిజానికి అది హెల్త్ కు చాలా మంచిది. అమ్మాయి ప్రాముఖ్యత ని తెలిజేసేలా ఆ క్యారెక్టర్ ని చాలా అద్భుతంగా డిజైన్ చేయడం జరిగింది. ఒరిజినల్ లో దర్శన గారికి కంటెన్ ఈషా గారి పాత్ర చాలా ఇంపాక్ట్ ఫుల్ గా ఉంటుంది. ఈ సినిమాలో దాదాపు అన్ని కొత్త సీన్లే ఉంటాయి. ఒరిజినల్ నుంచి జస్ట్ కోర్ ఐడియా ఒక్కటే తీసుకున్నాము మిగతా ట్రీట్మెంట్ అంతా చాలా కొత్తగా ఉంటుంది. ఇందులో బ్రహ్మాజీ గారితో పాటు మిగతా క్యారెక్టర్ ఆర్టిస్టులు పాత్రలన్నీటిలో మంచి ఫన్ వుంటుంది.

**ఇండస్ట్రీలో ఈ సినిమా ఎవరు చూశారు?**
సురేష్ బాబు గారు చూశారు. అలాగే తరుణ్ అన్న ఫ్రెండ్స్ అందరు చూశారు. అన్ని వైపుల నుంచి చాలా మంచి పాజిటివ్ రిపోర్ట్స్ వచ్చాయి.

**నెక్స్ట్ చేయబోయే కథల గురించి?**
కొన్ని కథలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత వాటి గురించి ప్రయత్నించాలి. నాకు మంచి డ్రామా ఉన్న కథలు చేయడం ఇష్టం.

-ఎం.డి అబ్దుల్





## ఘనంగా ప్రారంభమైన
# ఆత్రేయపురం బ్రదర్స్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఒకప్పటిలా లేవు రోజులు.. ట్రెండ్ మారింది. అందుకు తగ్గట్టుగానే ఆడియన్స్ ఆలోచనలు, టేస్ట్ కూడా మారిపోయాయి. కాబట్టి ప్రేక్షకులు కనెక్ట్ అయ్యే కొత్త కొత్త కథలతోనే మేకర్స్ సినిమాలు ప్లాన్ చేస్తున్నారు. అలాంటి ఓ వైవిధ్యభరితమైన స్టోరీ తీసుకొని, ఇప్పటితరం ఆడియన్స్ కోరుకునే అన్ని అంశాలతో ఆత్రేయపురం బ్రదర్స్ అనే సినిమా రూపొందిస్తున్నారు డైరెక్టర్ రాజేష్ జగన్నాధం. ఎస్.2ఎస్ సినిమాస్, ది ఫెర్వేంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్లపై వి.ఎస్.కె. సంజీవ్, వంగపల్లి సందీప్, వంగపల్లి సంకీర్త్, ప్రవీణ్ గద్దె, రాజేష్ గద్దె, రాకేష్ గద్దె నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాజీవ్ కనకాల, గవిరెడ్డి, సన్నీ పత్సా, రఘు బాబు, గీత్ సాయిని, నేహా పఠాన్, సిద్ధార్థ్ గొల్లపూడి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో ఈ సినిమా పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ వశిష్ట, డైరెక్టర్ అనుదీప్, డైరెక్టర్ ఆదిత్య హాసన్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి వశిష్ట క్లాప్ కొట్టగా.. విజయ్ కనకమేడల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ప్రవీణ్ కాండ్రేగుల, ఆదిత్య హాసన్ స్క్రిప్ట్ అందించారు. మరో డైరెక్టర్ అనుదీప్ మొదటి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా వదిలిన కాన్సెప్ట్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఏ స్వీట్ రైవల్రీ అనే ట్యాగ్ లైన్ తో ఇద్దరు వ్యక్తులు బల పరీక్ష చేసుకుంటున్నట్లుగా ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇది చూస్తూనే ఈ సినిమా కథలో వైవిధ్యం ఉంటుందని, గత సినిమాల్లోకెల్లా ఈ సినిమా భిన్నంగా ఉండబోతుందని అర్థమవుతోంది. ఈ మూవీకి డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ రమీజ్ నవనీత్, మ్యూజిక్ డైరెక్టర్ సంతు ఓంకార్, ఎడిటర్ అనిల్ పసల, సౌంగ్ సింక్ సినిమా. అతిత్వరలో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు ప్రకటించనున్నారు.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**